



# ప్రజాప్రశ్న

తెలుగు దినపత్రిక






సంపుటి: 5 సంచిక: 9, పేజీలు - 08

ఆదివారం, జూన్ 8, 2025 వెల: 5 రూ/.

Published from Hyderabad, Nalgonda, Karimnagar, Warangal, Khammam, Vijayawada, Vishakhapatnam,Tirupati

### నేను ఆపకుంటే భారత్, పాక్ మధ్య
## అణుయుద్ధం జరిగేది
**- డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యలు**



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) భారత్, పాకిస్తాన్ మధ్య తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్న సమయంలో తాను జోక్యం చేసుకుని అణు యుద్ధం సంభవించకుండా ఆపగలిగానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి

2లో..

### "మ్యాచ్ ఫిక్సింగ్" ఆరోపణలపై
## ఎన్నికల సంఘం స్పందన
**- రాహుల్ వ్యాఖ్యలు పూర్తిగా తప్పుపట్టిన ఎన్నికల సంఘం**



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో 'మ్యాచ్ ఫిక్సింగ్' జరిగిందంటూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేసిన సంచలన ఆరోపణలను భారత ఎన్నికల సంఘం (ఈసీ) తీవ్రంగా ఖండించింది. ఈ ఆరోపణలు పూర్తిగా

2లో..

## ముంబయి ఐసీటీకి రూ.151 కోట్ల భారీ విరాళం
**- ప్రొఫెసర్ ఎంఎం శర్మ పుస్తకావిష్కరణలో ముఖేశ్ అంబానీ ప్రకటన**



ముంబై (ప్రశ్న న్యూస్) రిలయన్స్ ఇండస్ట్రీస్ ఛైర్మన్ మరియు మేనేజింగ్ డైరెక్టర్, ప్రముఖ పారిశ్రామికవేత్త ముఖేశ్ అంబానీ తన దాతృత్వాన్ని మరోసారి చాటుకున్నారు. తాను విద్యనభ్యసించిన ముంబయిలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ (ఐసీటీ)కి ఏకంగా రూ.151 కోట్ల భారీ విరాళాన్ని ప్రకటించారు. ఈ మొత్తాన్ని సంస్థ అభివృద్ధికి ఏ విధంగానైనా

2లో..

### మహారాష్ట్ర ఎన్నికల్లో
## బీజేపీ మ్యాచ్ ఫిక్సింగ్
**- రాహుల్ గాంధీ సంచలన వ్యాఖ్యలు**



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) కాంగ్రెస్ అగ్రనేత, లోక్ సభలో ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ బీజేపీ పై మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. గతేదాది మహారాష్ట్రలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మ్యాచ్ ఫిక్సింగ్, రిగ్గింగ్ చేసి బీజేపీ నేతృత్వంలోని మహాయుతి కూటమి గెలిచిందని రాహుల్ గాంధీ ఆరోపించారు. మహారాష్ట్ర చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా 288 సీట్లకు గాను కూటమికి 235 సీట్లు వచ్చాయని మ్యాచ్ ఫిక్సింగ్, రిగ్గింగ్ కారణంగానే ఎన్డీఏ కూటమికి ఇన్ని సీట్లు వచ్చాయని రాహుల్ గాంధీ సంచలన ఆరోపణలు చేశారు. కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ మరోసారి బీజేపీ కూటమిపై సంచలన ఆరోపణలు చేశారు. 2024లో

2లో..

# కేబినెట్ విస్తరణకు రంగం సిద్ధం



**- అధిష్ఠానం గ్రీన్ సిగ్నల్ - నేడు కేబినెట్ విస్తరణ జరిగే సూచనలు**
**- కొత్తగా ముగ్గురు లేదా నలుగురికి మంత్రి పదవులు దక్కే అవకాశం**

**ఎట్టకేలకు తెలంగాణ మంత్రివర్గ విస్తరణకు ముహూర్తం ఖరారైంది. కొంత కాలంగా తెలంగాణ మంత్రివర్గ విస్తరణ పైన పెద్ద ఎత్తున చర్చ సాగుతోంది. ఢిల్లీలోనూ కసరత్తు జరిగింది. సామాజిక సమీకరణాల సమతుల్యత పేరుతా వాయిదా పడుతూ వచ్చింది. అయితే, ఇప్పుడు ఏఐసీసీ మంత్రివర్గ విస్తరణకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మంత్రివర్గంలోకి తీసుకునే వారి పేర్ల జాబితాకు ఢిల్లీ ఆమోద ముద్ర వేసింది. శాఖల్లోనూ మార్పులు ఖాయమయ్యాయి.**

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ మంత్రి వర్గ విస్తరణకు ముహూర్తం ఖరారైంది. ముగ్గురు లేదా నలుగురు వరకు చోటుండే అవకాశం ఉంది. తొలుత అయిదుగురు వరకు ఛాన్స్ ఉంటుందని భావించినా ముగ్గురి పేర్లకు ఇప్పటి వరకు ఆమోదం లభించింది. ఆషాఢ మాసము ప్రారంభం అవుతుండటం తో విస్తరణ వెంటనే చేపట్టాలని సీఎం రేవంత్ కోరారు. దీనికి ఏఐసీసీ ఆమోదం తెలపటంతో నేడు విస్తరణ చేపట్టాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. కుల గణన, బీసీ రిజర్వేషన్లకు పెద్దపీట వేస్తున్న కాంగ్రెస్ పార్టీ, అదే బాటలో మంత్రివర్గ విస్తరణలోనూ సామాజిక న్యాయాన్ని పాటించాలని నిర్ణయించినట్లు సమాచారం. ఐదు మంత్రి పదవుల్లో రెడ్డి సామాజిక వర్గానికి ఒకటి ఇవ్వాలని ఇప్పటికే నిర్ణయించగా, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు అవకాశం కల్పించాలనే నిర్ణయానికి వచ్చారని తెలుస్తోంది. ఓసీ కేటగిరీలో రెడ్డి సామాజిక వర్గం నుంచి ఇద్దరికి అవకాశం కల్పించే అంశంపైనా చర్చించినట్లు తెలిసింది. ఇక మంత్రివర్గంలో ఒకరిద్దరికి స్థానచలనం తప్పదనే చర్చ వినిపిస్తోంది. మంత్రులు గా తొలిగించిన వారికి పార్టీలో

2లో..

### రాజీవ్ స్వగృహ ఆస్తుల అమ్మకానికి ప్రభుత్వం పచ్చజెండా
**- ఈ నెల 20న విక్రయ నోటిఫికేషన్ జారీకి ఏర్పాట్లు**




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాల నిధుల సమీకరణకు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ పరిధిలోని అపార్ట్‌మెంట్ ఫ్లాట్లు, టవర్లు, ఖాళీ స్థలాలను విక్రయించేందుకు సిద్ధమవుతోంది. ఈ ఆస్తులను దశల వారీగా అమ్మకానికి ఉంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనికి సంబంధించిన నోటిఫికేషన్ ఈ నెల 20వ తేదీ నాటికి విడుదల చేయడానికి అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఈ విషయంపై గృహనిర్మాణ బోర్డు కమిషనర్ వి.పి. గౌతమ్ మాట్లాడుతూ,

2లో..

---

### కాళేశ్వరం ప్రాజెక్టుపై
## కాంగ్రెస్ ఆరోపణలు
**- లెక్కలతో సహా వాస్తవాలు వెల్లడించిన హరీశ్ రావు**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) కాళేశ్వరం ప్రాజెక్టుపై దుష్ప్రచారాలు - వాస్తవాలు పేరిట తెలంగాణ మాజీమంత్రి హరీశ్ రావు తెలంగాణ భవన్‌లో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా మొత్తం 20 లక్షల 33 వేల 572 ఎకరాలకు సాగునీరు అందిస్తే, ఒక్క ఎకరాకు నీళ్లు ఇవ్వలేదు అని కాంగ్రెస్ నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారని తెలిపారు. కాళేశ్వరం ద్వారా 20 లక్షల పైగా ఎకరాలకు సాగు నీరు అందిందని కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వానికి ఇరిగేషన్ ఇంజనీర్స్ రిపోర్ట్ ఇచ్చారని హరీష్ రావు స్పష్టం చేశారు.

**- 141 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం**

గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్మించాలని చూసిన ప్రాణహిత - చేవెళ్ల ప్రాజెక్టు

2లో..

### హైదరాబాద్‌లో
## రఫేల్ తయారీ
**- రక్షణ ఎగుమతులలో భారత్ ప్రగతి**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) భారత రక్షణ రంగంలో మరో ముందడుగు పడింది. ఫ్రాన్స్‌కు చెందిన ప్రఖ్యాత డసో ఏవియేషన్ సంస్థ యొక్క రఫేల్ యుద్ధ విమానాల ప్రధాన భాగాలైన

2లో..

### పార్టీకి, ప్రభుత్వానికి చెడ్డపేరు తెస్తే
## ఎవరినైనా వదులుకుంటా

- కూటమి ప్రభుత్వ ఏడాది పాలనపై 12న రాష్ట్రవ్యాప్త విజయోత్సవ ర్యాలీలు
- అదే రోజు అమరావతిలో ఎన్డీయే నేతలు, అధికారులతో సీఎం సమీక్ష
- తల్లికి వందనం, అన్నదాత పథకాలు ఈ నెలలోనే, ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు
- జూన్ 21న విశాఖలో 5 లక్షల మందితో భారీ యోగా కార్యక్రమం



అమరావతి (ప్రశ్న న్యూస్) రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంలో ప్రజాప్రతినిధుల పనితీరు సంతృప్తికరంగా లేకపోతే వారిని పదవుల నుంచి తొలగించడానికి వెనుకాడబోనని ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రస్థాయిలో హెచ్చరించారు. పార్టీకి, ప్రభుత్వానికి అప్రతిష్ఠ తెచ్చే వారిని ఉపేక్షించే ప్రసక్తే లేదని ఆయన కరాఖండిగా స్పష్టం చేశారు. తొలిసారి గెలిచిన శాసనసభ్యులు మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, అతివిశ్వాసానికి పోతే తీవ్ర నష్టం తప్పదని హితవు పలికారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తి చేసుకుంటున్న శుభసందర్భంగా ఈ నెల 12న రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో విజయోత్సవ ర్యాలీలు నిర్వహించాలని, అదే రోజు అమరావతిలో ఎన్డీయే భాగస్వామ్య పక్షాల నేతలు, ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం ఉంటుందని వెల్లడించారు. ఈ మేరకు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, వివిధ స్థాయిల్లోని పార్టీ నాయకులతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి

2లో..

---

### ఆటో డ్రైవర్లకు
## గుడ్ న్యూస్
**- హైదరాబాద్ లో కొత్త ఆటోలకు అనుమతి**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్ నగరంలో పెరుగుతున్న ట్రాఫిక్, వాయు కాలుష్యం సమస్యలను సమర్థవంతంగా ఎదుర్కోవడానికి తెలంగాణ ప్రభుత్వం ఒక కీలకమైన ముందడుగు వేసింది. నగర కేంద్ర భాగంలోని ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్) లోపలి ప్రాంతంలో కొత్త ఆటోల ప్రవేశాన్ని నియంత్రిస్తూ, పర్యావరణానికి మేలు చేసే వాహనాలకు ప్రాధాన్యతనిస్తూ రవాణా శాఖ నూతన ఆదేశాలు జారీ చేసింది. జీవో 263 ద్వారా అమలులోకి వచ్చిన

3లో..

### మందులు లేని మహమ్మారితో
## జగన్ బాధపడుతున్నాడు
**- జగన్‌కు మంత్రి నారా లోకేష్ స్ట్రాంగ్ వార్నింగ్**



అమరావతి (ప్రశ్న న్యూస్) ఏపీ మాజీ సీఎం వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డిపైన రాష్ట్ర ఐటీ మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. మహిళలను అవమానించిన వారు చరిత్రలో కలిసి పోవడం ఖాయమని మండిపడ్డారు. అమరావతి దేవతల రాజధాని కాదు అది వేశ్యల రాజధాని అంటూ ఓ టీవీ జర్నలిస్టు చేసిన వ్యాఖ్యలను మంత్రి నారా లోకేష్ తీవ్రంగా ఖండించారు.అమరావతి మహిళలను ఉద్దేశించి సాక్షి మీడియాలో వచ్చిన వార్తలపైన ఎక్స్ వేదికగా స్పందించిన నారా లోకేష్ రాజధాని మహిళలను అవమానిస్తే కాలగర్భంలో

3లో..

## చేప ప్రసాదం పంపిణీకి సర్వం సిద్ధం
**- భారీ ఏర్పాట్లు చేసిన తెలంగాణ ప్రభుత్వం**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్‌లో నేటి నుంచి రెండు రోజులపాటు చేప ప్రసాదం పంపిణీ చేయనున్నారు. దీని కోసం ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేసింది. నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో జరిగే కార్యక్రమంలో ప్రత్యేక బస్‌లు ఏర్పాటు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే వెహికల్స్ కోసం పార్కింగ్‌లు సిద్ధం చేశారు. రెండు రోజుల పాటు ఆ ప్రాంతం రద్దీగా ఉంటుంది. అందుకే ఏరియాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. మృగశిరకార్తెను పురస్కరించుకొని బత్తిన వంశస్తులు ఏటా చేప ప్రసాదం పంపిణీ చేస్తుంటారు. ఇది తరతరాలుగా వస్తున్న సంప్రదాయం. ఈ ప్రసాదం తీసుకుంటే ఆస్తమా కంట్రోల్ అవుతుందనే ప్రచారం చాలా కాలంగా ఉంది. అందుకే సుదూర తీరాల నుంచి వచ్చే ప్రజలంతా నాంపల్లి గ్రౌండ్‌కు వచ్చి చేప ప్రసాదం తీసుకుంటారు. భారీ

3లో..

### కాగ్ లెక్కలతో రాష్ట్ర ఆర్థిక దుస్థితి
## బట్టబయలైంది

- ఏప్రిల్ 2025 ఆర్థిక గణాంకాలపై కాగ్ నివేదిక విడుదల
- రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఆందోళనకరంగా ఉందన్న జగన్
- జీఎస్టీ వసూళ్లపై ప్రభుత్వ ప్రకటనలకు, కాగ్ లెక్కలకు భారీ తేడా ఉందని వెల్లడి
- ఐజీఎస్టీ సర్దుబాటు పేరుతో ప్రభుత్వం వాస్తవాలను దాస్తోందని విమర్శ



అమరావతి (ప్రశ్న న్యూస్) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దిగజారిందంటూ వైసీపీ అధినేత జగన్ తీవ్రస్థాయిలో విమర్శలు సంధించారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియాలో స్పందించారు. కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) విడుదల చేసిన ఏప్రిల్ 2025 నెలవారీ కీలక సూచికలు తీవ్ర ఆందోళనకరమైన చిత్రాన్ని ఆవిష్కరిస్తున్నాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ప్రచారానికి, వాస్తవ ఆర్థిక స్థితిగతులకు పొంతన లేదని ఈ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయని వివరించారు.

**జీఎస్టీ వసూళ్లపై ప్రభుత్వ మాయాజాలం**

మే 1వ తేదీన రాష్ట్ర ప్రభుత్వం ఒక పత్రికా ప్రకటన విడుదల చేస్తూ, 2025 ఏప్రిల్ నెలలో రాష్ట్రానికి నికర జీఎస్టీ వసూళ్లు రూ. 3,354

2లో..

నేను ఆపకుంటే భారత్, పాక్ మధ్య అణుయుద్ధం జరిగేది

సంచలన వ్యాఖ్యలు చేశారు. వాణిజ్యపరమైన ఒత్తిడి తీసుకురావడం ద్వారానే ఇరు దేశాల మధ్య ఘర్షణలను ఆగిపోయాయని ఆయన పేర్కొన్నారు. ఆశ్చర్యకరంగా, ట్రంప్ వాదనలకు రష్యా నుంచి మద్దతు లభించగా, భారత అధికారులు మాత్రం ఈ మధ్యవర్తిత్వ ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్‌తో ఈ విషయంపై తమ ఆందోళనలను నేరుగా తెలియజేశారు.

### ట్రంప్ వ్యాఖ్యలు, రష్యా సమర్థన

శుక్రవారం ఎయిర్ ఫోర్స్ వన్ విమానంలో విలేకరులతో మాట్లాడుతూ, డొనాల్డ్ ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. "మీకు తెలుసా, నేను ఒక పెద్ద సమస్యను పరిష్కరించాను, దాని గురించి ప్రజలు ఎక్కువగా మాట్లాడరు, నేను కూడా ఎక్కువగా చెప్పను. కానీ భారత్, పాకిస్తాన్ మధ్య అణు సమస్యను, బహుశా అణుయుద్ధాన్ని నివారించాను. నాకు పాకిస్తాన్‌తో మాట్లాడటం, భారత్‌తో మాట్లాడటం, వారికి గొప్ప నాయకులు ఉన్నారు, కానీ వారు తీవ్రంగా ఘర్షణ పడుతున్నారు, అది అణుయుద్ధానికి దారితీసేది," అని ట్రంప్ తెలిపారు. ఘర్షణలను కొనసాగితే అమెరికాతో వాణిజ్యం నిలిపివేస్తామని హెచ్చరించిన తర్వాతే ఇరు దేశాలు దాడులు ఆపాయని ఆయన వివరించారు.

### భారత్ తీవ్ర అభ్యంతరం

అయితే, అమెరికా అధ్యక్షుడి వ్యాఖ్యలు దౌత్యపరమైన ప్రతిఘటనకు దారితీశాయి. అమెరికాలో పర్యటిస్తున్న అఖిలపక్ష ప్రతినిధి బృందానికి నాయకత్వం వహిస్తున్న కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్, ట్రంప్ మధ్యవర్తిత్వ వాదనలను అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ వద్ద నేరుగా ప్రస్తావించినట్లు తెలిపారు. "ఉపాధ్యక్షుడు వాన్స్‌తో సమావేశం అద్భుతంగా, చాలా స్పష్టంగా జరిగింది. మధ్యవర్తిత్వం అనే ఈ ప్రశ్నకు మా వైఖరిని స్పష్టంగా తెలియజేశామని నేను భావిస్తున్నాను, ఉపాధ్యక్షుడు వాన్స్ మా వాదనలను పూర్తిగా అర్థం చేసుకున్నారు," అని థరూర్ వివరించారు.

# "మ్యాచ్ ఫిక్సింగ్" ఆరోపణలపై ఎన్నికల సంఘం స్పందన

అసంబద్ధమైనవని, నిరాధారమైనవని పేర్కొంటూ గట్టిగా బదులిచ్చింది. ఈ మేరకు గత ఏప్రిల్‌లో ఇచ్చిన వివరణాత్మక పత్రాన్ని మరోసారి విడుదల చేసింది. ఓ ప్రముఖ ఆంగ్ల దినపత్రికలో రాసిన వ్యాసంలో రాహుల్ గాంధీ, 2024 నవంబరులో జరిగిన మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల నిర్వహణపై తీవ్ర అనుమానాలు వ్యక్తం చేశారు. ఎన్నికల సంఘం నియామక ప్యానెల్‌ను తారుమారు చేయడం, ఓటర్ల జాబితాలో నకిలీ ఓటర్లను చేర్చడం, ఓటింగ్ శాతాన్ని కృత్రిమంగా పెంచి చూపడం, లక్షిత దొంగ ఓటింగ్ వంటి పలు తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ నేపథ్యంలోనే కాంగ్రెస్ నేత ఘోర పరాజయం పాలైందని ఆయన ఆరోపించారు. ఎన్నికల సంఘం సంతకం లేని, దాటవేసే ధోరణిలో నోట్స్ విడుదల చేసిందని, తాను లేవనెత్తిన ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వకుండా, బూత్ సీసీటీవీ ఫుటేజీను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అయితే, ఎన్నికల సంఘం రాహుల్ ఆరోపణలను తోసిపుచ్చింది. పోలింగ్ సమయంలో గానీ, ఆ తర్వాత జరిగిన పరిశీలనలో గానీ కాంగ్రెస్ సహా ఏ రాజకీయ పార్టీ ఏజెంట్లు నుంచి కూడా తీవ్రమైన ఫిర్యాదులు రాలేదని ఈసీ స్పష్టం చేసింది. ఓటర్ల జాబితా సవరణపైనా పెద్దగా అభ్యంతరాలు వ్యక్తం కాలేదని, 9.77 కోట్ల ఓటర్లకు గాను కేవలం నామమాత్రపు అప్పీల్లే దాఖలయ్యాయని గుర్తు చేసింది. కాంగ్రెస్ పార్టీయే రాష్ట్రవ్యాప్తంగా 27,000 మందికి పైగా బూత్ లెవల్ ఏజెంట్లను నియమించిందని, వారెవరూ ఈ తరహా ఫిర్యాదులు చేయలేదని పేర్కొంది. ఇప్పటికే ఈ అంశాలపై కాంగ్రెస్ పార్టీకి గతేడాది డిసెంబర్ 24న సమగ్ర సమాధానం ఇచ్చామని, ఆ వివరాలు ఈసీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని తెలిపింది. వాస్తవాలను విస్మరించి, పదేపదే నిరాధార ఆరోపణలు చేయడం చట్టబద్ధ పాలనను అపహాస్యం చేయడమేనని ఈసీ వ్యాఖ్యానించింది. భారత ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, ప్రపంచస్థాయి ప్రమాణాలతో జరుగుతుందని, ఓటర్ల తీర్పు వ్యతిరేకంగా వచ్చినప్పుడు ఎన్నికల సంఘాన్ని నిందించడం తగదని హితవు పలికింది.

### ముంబయి ఐసీటీకి రూ.151 కోట్ల భారీ విరాళం

ఉపయోగించుకోవచ్చని ఆయన సూచించారు. విఖ్యాత రసాయన శాస్త్రవేత్త, ప్రొఫెసర్ ఎంఎం శర్మ జీవిత చరిత్ర ఆధారంగా రూపొందిన 'డివైన్ సైంటిస్ట్' పుస్తకావిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సందర్భంగా ముఖేశ్ అంబానీ ఈ కీలక ప్రకటన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ విరాళం తన గురువు ప్రొఫెసర్ శర్మకు ఇచ్చే గురుదక్షిణ అని పేర్కొన్నారు. ముఖేశ్ అంబానీ 1970వ సంవత్సరంలో ఐసీటీ నుంచి కెమికల్ ఇంజనీరింగ్‌లో పట్టభద్రులయ్యారు. ఆ రోజుల్లో ఈ సంస్థను యూనివర్సిటీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ (యూడీసీటీ)గా పిలిచేవారని ఆయన గుర్తు చేసుకున్నారు. సుమారు మూడు గంటలకు పైగా ఐసీటీ ప్రాంగణంలో గడిపిన అంబానీ, యూడీసీటీలో తన విద్యార్థి దశ జ్ఞాపకాలను, ప్రొఫెసర్ శర్మతో తనకున్న అనుబంధాన్ని నెమరువేసుకున్నారు. ప్రొఫెసర్ శర్మ దార్శనికత వల్లే భారత ఆర్థిక వ్యవస్థలో కీలక సంస్కరణలకు బీజం పడిందని అంబానీ అభిప్రాయపడ్డారు. "భారత పరిశ్రమను లైసెన్స్ పర్మిట్ రాజ్ కబంధ హస్తాల నుంచి విడిపిస్తేనే దేశం పారిశ్రామికంగా పురోగమిస్తుందని, ప్రపంచ దేశాలతో పోటీ పడగలదని ప్రొఫెసర్ శర్మ బలంగా నమ్మేవారు. ఈ విషయాన్ని అప్పటి పాలకులకు అర్థమయ్యేలా చెప్పడంలో ఆయన విజయం సాధించారు," అని అంబానీ వివరించారు. తన తండ్రి, రిలయన్స్ వ్యవస్థాపకులు ధీరూభాయ్ అంబానీ కూడా దేశ పారిశ్రామిక ప్రగతి కోసం ఎలా తపించేవారో, అదే ఆకాంక్ష ప్రొఫెసర్ శర్మలో కూడా కనిపించేదని ఆయన అన్నారు. ప్రొఫెసర్ శర్మను 'గురు ఆఫ్ భారత్'గా అభివర్ణిస్తూ, ఆయన సేవలకు గుర్తింపుగా ఈ విరాళాన్ని అందిస్తున్నట్లు ముఖేశ్ అంబానీ సభాముఖంగా తెలిపారు.

### రాజీవ్ స్వగృహ ఆస్తుల అమ్మకానికి ప్రభుత్వం పచ్చజెండా

రాజీవ్ స్వగృహ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో మొత్తం 11 ప్రాంతాలలో నిర్మాణం పూర్తయిన, పాక్షికంగా పూర్తయిన అపార్ట్‌మెంట్లు, ఓపెన్ ప్లాట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. వీటితో పాటు, హౌసింగ్ బోర్డు పరిధిలోని మరో 4 ప్రాంతాల్లో ఉన్న ఓపెన్ ప్లాట్లు, ఇతర ఖాళీ స్థలాలను కూడా బహిరంగ వేలం ద్వారా విక్రయించనున్నట్లు ఆయన వివరించారు. ప్రభుత్వం చేపట్టనున్న ఈ విక్రయాల ద్వారా ఎలాంటి వివాదాలు లేని, స్పష్టమైన యాజమాన్య హక్కులు కలిగిన ఆస్తులను కొనుగోలు చేయాలనుకునే వారికి ఇది మంచి అవకాశమని కమిషనర్ గౌతమ్ అభిప్రాయపడ్డారు.

# కాగ్ లెక్కలతో రాష్ట్ర ఆర్థిక దుస్థితి బట్టబయలైంది

కోట్లుగా నమోదయ్యాయని, జీఎస్టీ ప్రవేశపెట్టినప్పటి నుంచి ఇదే అత్యధికమని గొప్పలు చెప్పుకుంది. సాంకేతికంగా చూస్తే, అన్ని సర్దుబాట్ల తర్వాత వచ్చేదే నికర జీఎస్టీ. అయితే, కాగ్ విడుదల చేసిన 2025 ఏప్రిల్ గణాంకాలు అసలు నిజాన్ని తేటతెల్లం చేశాయి. ఈ ఆర్థిక సంవత్సరం తొలి నెలలోనే, అంటే 2025 ఏప్రిల్ లో, రాష్ట్ర జీఎస్టీ ఆదాయాలు 2024 ఏప్రిల్ తో పోలిస్తే ఏకంగా 24.20% మేర తగ్గుదల చూపించాయి. కాగ్ గణాంకాలు బహిర్గతమైన వెంటనే, ప్రభుత్వం మరోసారి మే నెలలో కూడా జీఎస్టీ ఆదాయాలు రికార్డు స్థాయిలో ఉన్నాయని పేర్కొంటూ ఒక కుట్రపూరితమైన ప్రకటన విడుదల చేసింది.

ఈ ప్రకటనలో, 2025 ఏప్రిల్ లో కేంద్ర ప్రభుత్వం ఐజీఎస్టీ నుంచి ముందస్తు కేటాయింపుల సర్దుబాటు కింద రూ. 796 కోట్లు మినహాయించుకుందని, అందువల్లే జీఎస్టీ ఆదాయం తగ్గిందని పేర్కొంది. వాస్తవానికి, ఐజీఎస్టీ ముందస్తు కేటాయింపు అనేది ప్రభుత్వ ఖాతాల్లోని మేజర్ హెడ్ 0006 కింద మైనర్ హెడ్ 110 పరిధిలోకి వస్తుంది. ఇది ఒక సాధారణ ప్రక్రియ. అన్ని సర్దుబాట్లు లెక్కించిన తర్వాతే నికర జీఎస్టీ ఆదాయాలు నిర్ణయించబడతాయి. గత సంవత్సరాల్లో కూడా ఇదే పద్ధతి కొనసాగింది. మే 14 నాటి ప్రకటనలో 2025 ఏప్రిల్ నికర జీఎస్టీ వసూళ్లు రూ. 3,354 కోట్లు అని చెప్పిన ప్రభుత్వం, ఇప్పుడు రూ. 796 కోట్లు సర్దుబాటు అయ్యాయని చెప్పడం, కాగ్ ద్వారా జీఎస్టీ ఆదాయాల గురించిన నిజం బయటపడిన తర్వాత దాన్ని కప్పిపుచ్చుకునే ప్రయత్నమేనని స్పష్టంగా అర్థమవుతోంది.

### పన్ను, పన్నేతర ఆదాయాల్లోనూ భారీ క్షీణత

టీడీపీ ప్రభుత్వం చెబుతున్న దానికి పూర్తి విరుద్ధంగా, కాగ్ విడుదల చేసిన గణాంకాలు ఈ ఆర్థిక సంవత్సరం తొలి నెలలోనే ఆర్థిక మందగమనం మరింత స్పష్టంగా కనిపిస్తోందని సూచిస్తున్నాయి. 2024 ఏప్రిల్ తో పోలిస్తే పన్ను ఆదాయాలు 12.21%, పన్నేతర ఆదాయాలు 22.01% మేర తగ్గుదల నమోదు చేశాయి. రాష్ట్ర సొంత ఆదాయాలను పరిగణనలోకి తీసుకుంటే, గత ఏడాదితో పోలిస్తే తగ్గుదల 12.76%గా ఉంది.

ఈ గణాంకాలు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అత్యంత నిరాశాజనకంగా ఉందని స్పష్టం చేస్తున్నాయి. ప్రభుత్వం వాస్తవాలను దాచిపెట్టి, అబద్ధపు ప్రచారాలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని ఈ లెక్కలు తేటతెల్లం చేస్తున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం వాస్తవాలను అంగీకరించి, ఆర్థిక క్రమశిక్షణ దిశగా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది అంటూ జగన్ ట్వీట్ చేశారు.

# కేబినెట్ విస్తరణకు రంగం సిద్ధం

బాధ్యతలు అప్పగించనున్నట్లు సమాచారం. ఇప్పటికే వివాదాస్పద వ్యాఖ్యలతో విమర్శలకు గురైన మంత్రితో పాటుగా మరో మంత్రి పేరు తెర మీదకు వస్తోంది. కాగా, సామాజిక సమీకరణాల ఆధారంగా తుది నిర్ణయం తీసుకోనున్నారు. కాగా, తాజాగా ఎమ్మెల్సీ పదవి దక్కించుకున్న విజయశాంతికి మంత్రి పదవి ఖాయమని తెలుస్తోంది. నల్గొండ జిల్లాకు చెందిన రేవంత్ సన్నిహిత నేత అద్దంకి దయాకర్ ను మంత్రివర్గంలోకి తీసుకునే అవకాశం కనిపిస్తోంది. నల్గొండ నుంచి కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పేరు రేసులో ఉండగా ఇప్పుడు దయాకర్ పేరు తెర మీదకు వచ్చింది. దీంతో, ఈ ఇద్దరిలో ఎవరికి చివరికి అవకాశం దక్కుతుందనేది కీలకంగా మారుతోంది.కాగా, కాంగ్రెస్ అధినాయకత్వం మాత్రం మంత్రివర్గ విస్తరణ ద్వారా కొత్త సమస్యలు రాకుండా చూడాలని పార్టీ నేతలకు స్పష్టం చేసింది. త్వరలో ఆషాడ మాసం ప్రారంభం కానుంది. దీంతో, ముందుగా ముగ్గురితో మంత్రివర్గ విస్తరణ ప్రతిపాదన తెర మీదకు వచ్చింది. దీని ద్వారా వచ్చే స్పందనలకు అనుగుణంగా మిగిలిన బెర్తులు పూర్తి చేయాలనేది పార్టీ ఆలోచనగా తెలుస్తోంది. అయితే, పార్టీ నతేలు మాత్రం మంత్రివర్గ విస్తరణ విషయంలో ఆచితూచి వ్యవహరిస్తున్నారు. విస్తరణ పైన ఓపెన్ గా స్పందించేందుకు పార్టీ నేతలు నిరాకరిస్తున్నారు. ఒక వేళ నేడు విస్తరణ వాయిదా పడితే ఈ నెల 22వ తేదీలోగా మాత్రం మంత్రివర్గ ప్రక్షాళనతో పాటుగా టీపీసీసీ కార్యవర్గం సైతం అధికారికంగా ఖరారు కానుందని సమాచారం.

### తొలి నుంచి సమస్యగా

తెలంగాణ కేబినెట్ విస్తరణ అధినాయకత్వానికి తొలి నుంచి పెద్ద సమస్యగా మారింది. విస్తరణ చేపడితే సమస్యలు ఏర్పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇప్పటికే అనేక మంది ఆశావహులు మంత్రి పదవి కోసం ఆశలు పెంచుకున్నారు. రెండేళ్ల నుంచి ఆరు మంత్రి పదవులను భర్తీ చేయకపోవడానికి కారణాలు ఇవే. ఎప్పుడు విస్తరణ చేపట్టినా కందిరీగల తుట్టె కదిలించినట్లేనన్న భావన హైకమాండ్ లో ఏర్పడిందని అర్థమవుతుంది. కాంగ్రెస్ అంటే అంతే. ప్రతి వారూ తాము మంత్రిపదవికి అర్హులమని భావిస్తారు. ప్రాంతీయ పార్టీల్లో మాదిరి కాదు. అక్కడయితే అధినేత నిర్ణయమే శిరోధార్యం. కానీ ఇక్కడ అలా కాదు. తాము కూడా ప్రభుత్వం అధికారంలోకి రావడానికి కారణమని గట్టిగా నమ్ముతారు.

### ఆశావహులు ఎక్కువ మంది..

అందుకే హైదరాబాద్ కు వచ్చిన మీనాక్షి నటరాజన్ ను వరస పెట్టి నేతలు కలసి తమకు మంత్రి వర్గ విస్తరణలో అవకాశం కల్పించాలని కోరుతున్నారు. ఉన్న పదవులు ఆరు. పోటీ పడే వారి సంఖ్య పదుల్లోనే ఉంది. పైగా సామాజికవర్గం కోటా, ప్రాంతీయ కోటా అంటూ తమకు అవకాశం కల్పించాలని కోరుతున్నారు. ఇక హైకమాండ్ లో లాబీయింగ్ చేసే వారు కూడా ఎక్కువ మంది ఉన్నారు. ఏదో ఒక రూట్లో ఢిల్లీకి వెళ్లి అధినాయకత్వాన్ని ప్రసన్నం చేసుకుని మంత్రి పదవి దక్కించుకోవాలని ప్రయత్నం చేస్తున్నారు. పార్టీలు మారి వచ్చిన వారు కూడా ఈ దఫా తమకు అవకాశం కల్పించాలని కోరతున్నారు. తాము కాంగ్రెస్ లో చేరే సమయంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరుతున్నారు.

### నమ్మకం, విధేయతలకు..

ఇక ఎప్పటి నుంచో కాంగ్రెస్ పార్టీలో నమ్మకంగా ఉంటున్న వారు తమకు అవకాశం కల్పించాలని, పార్టీ విధేయతకు పట్టం కట్టాలని కోరుతున్నారు. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, గడ్డం వినోద్ లు పార్టీలు మారి వచ్చి తమకు మంత్రి పదవి కావాలని కోరుతున్నారు. ప్రేమ్ సాగర్ రావు, సుదర్శన్ రెడ్డి వంటి నేతలు విధేయతను చూడాలంటున్నారు. మరొకవైపు హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలకు ప్రాతినిధ్యం లేదని, తమకు అవకాశం కల్పించాలని మరికొందరు షరతులు విధిస్తున్నారు. ఇక మాదిగ సామాజికవర్గానికి ఖచ్చితంగా ఒక మంత్రి పదవి ఇవ్వాలంటూ ఆ సామాజికవర్గం నేతలు పట్టుబడుతున్నారు. అయితే రెండేళ్ల నుంచి మంత్రివర్గ విస్తరణ జరపకపోతే తప్పుడు సంకేతాలు వెళతాయన్న అభిప్రాయం కూడా వ్యక్తమయి హైకమాండ్ విస్తరణకు ఓకే చెప్పింది. ఈ దఫా విస్తరణలో బీసీలకు, ఎస్సీలకు అవకాశం కల్పించే అవకాశాలున్నాయి. గడ్డం వినోద్ తో పాటు బీసీ కోటాలో వాకిటి శ్రీహరితో పాటు ఆది శ్రీనివాస్ పేరు కూడా వినిపిస్తుంది. ఎస్టీ కోటాలో బాలూ నాయక్ పేరు కూడా పరిశీలనలో ఉంది.

# హైదరాబాద్‌లోరఫేల్ తయారీ

ఫ్యూసిలేజ్‌లు ఇకపై హైదరాబాద్‌లో తయారు కానున్నాయి. ఈ మేరకు టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ (టీఏఎస్ఎల్), దసో ఏవియేషన్ మధ్య ఒక ఒప్పందం కుదిరింది. ఈ విషయాన్ని కేంద్ర మంత్రి, బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి వెల్లడించారు. రఫేల్ యుద్ధ విమానాల తయారీకి సంబంధించి ఫ్రాన్స్ వెలుపల ఇటువంటి అత్యాధునిక విడిభాగాల తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం ఇదే మొదటిసారి. ఈ ఒప్పందం ద్వారా రఫేల్ యుద్ధ విమానాలకు అవసరమైన ఫ్యూసిలేజ్‌లను హైదరాబాద్‌లోని టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ ఉత్పత్తి చేయనుంది. ఈ పరిణామం తెలంగాణలో విమాన తయారీ పరిశ్రమ విస్తరణకు, దేశీయ సంస్థలు తమ తయారీ సామర్థ్యాన్ని మరింత ఉన్నతస్థాయికి తీసుకువెళ్లడానికి దోహదపడుతుందని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. ఈ భాగస్వామ్యం ద్వారా ప్రపంచ రక్షణ ఉత్పత్తుల సరఫరా వ్యవస్థలో భారత్ తన స్థానాన్ని మరింత పటిష్టం చేసుకోనుందని ఆయన అభిప్రాయపడ్డారు.ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో రక్షణ ఎగుమతులు గణనీయంగా వృద్ధి చెందాయని కిషన్ రెడ్డి తెలిపారు. 2013-14 ఆర్థిక సంవత్సరంలో రూ. 686 కోట్లుగా ఉన్న రక్షణ ఉత్పత్తుల ఎగుమతులు 2024-25 నాటికి రూ. 23,622 కోట్లకు చేరాయని ఆయన వివరించారు. ప్రస్తుతం భారత్ 80కి పైగా దేశాలకు రక్షణ ఉత్పత్తులను ఎగుమతి చేస్తోందని, ఇది దేశానికి గర్వకారణమని అన్నారు. "ఒకప్పుడు మనం దిగుమతి చేసుకునేవాళ్ళం, కానీ ఇప్పుడు మనమే తయారు చేస్తున్నాం, మనమే ఎగుమతి చేస్తున్నాం" అంటూ భారత్ సాధిస్తున్న ప్రగతిని కిషన్ రెడ్డి కొనియాడారు. భారత్ విశ్వసనీయమైన ప్రపంచ రక్షణ ఉత్పత్తి కేంద్రంగా ఎదుగుతోందని ఆయన హర్షం వ్యక్తం చేశారు.

# పార్టీకి, ప్రభుత్వానికి చెడ్డపేరు తెస్తే ఎవరినైనా వదులుకుంటా

ఈ కీలక వ్యాఖ్యలు చేశారు.ప్రభుత్వంతో పాటు పార్టీలోని ప్రతి ఒక్కరి పనితీరుపైనా తాను నిరంతరాయంగా సర్వేలు చేయిస్తున్నానని, ఎప్పటికప్పుడు సమాచారం సమీకరిస్తున్నానని చంద్రబాబు తేల్చిచెప్పారు. "మీరు వన్ టైం ఎమ్మెల్యేలుగా మిగిలిపోకూడదనేది నా ఆకాంక్ష. అధికారంలో ఉన్న మనల్ని ప్రజలు నిశితంగా గమనిస్తుంటారు. కాబట్టి, ప్రతి అడుగు ఆచితూచి వేయాలి" అని చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. ప్రతి ఆరు నెలలకోసారి ఎంపీలు, ఎమ్మెల్యేల పనితీరుపై సర్వే నివేదికలు తెప్పించుకుంటానని, మెరుగైన పనితీరు కనబరిస్తే అభినందించి, మరిన్ని అవకాశాలు కల్పిస్తానని, లోపాలుంటే మాత్రం కఠిన చర్యలు తప్పవని, ఈ విషయంలో రాజీ పడేది లేదని ఆయన పునరుద్ఘాటించారు. "వ్యవస్థకు నష్టం కలిగించే ఏ ఒక్కరినీ ఉపేక్షించను. మెజారిటీ ప్రజాప్రతినిధులు తమ పనితీరుతో ప్రజలకు చేరువయ్యారు. అయితే, కొందరి వల్ల నష్టం వాటిల్లుతోంది. త్వరలోనే ప్రతి ఎమ్మెల్యేతో వ్యక్తిగతంగా సమావేశమవుతాను," అని సీఎం పేర్కొన్నారు.కూటమి ప్రభుత్వం ఏడాది పూర్తి చేసుకుంటున్న నేపథ్యంలో ఈ నెల 12న రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో విజయోత్సవ ర్యాలీలు, సాయంత్రం అమరావతిలో సమీక్ష ఉంటుందన్నారు. "గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రం అంధకారంలో కూరుకుపోయింది. ఏడాదిలోనే మనం స్పష్టమైన మార్పు తీసుకొచ్చాం. సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి," అని సూచించారు. ఈ నెల 12 లేదా 14లోగా 'తల్లికి వందనం', ఈ నెలలోనే 'అన్నదాత', ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేస్తామన్నారు. రూ.5 లక్షల కోట్ల పెట్టుబడులకు అనుమతులిచ్చామని, 2027 నాటికి పోలవరం పూర్తిచేస్తామని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రయోజనాలే పరమావధి అని, పోలవరం - బనకచర్ల అనుసంధానంతో తెలంగాణకు నష్టం లేదని స్పష్టం చేశారు.

# 500 రూపాయల నోట్లను ప్రభుత్వం ఉపసంహరించుకోవటం లేదు

**న్యూ ఢిల్లీ** ప్రభుత్వం 500 రూపాయల నోట్లను ఉపసంహరించుకోవటం లేదు. అవి చలామణీలోనే ఉంటాయి. ఈ నోట్లు దేశవ్యాప్తంగా చట్టబద్ధంగా చెల్లుబాటు అవుతాయి. వాటి జారీ, స్వీకరణ యథావిధిగా కొనసాగుతుంది' అని ది ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో స్పష్టం చేసింది. ఇలాంటి తప్పుడు వార్తలను నమ్మి ప్రజలు మోసపోవద్దని సూచించింది

.రూ.2వేల నోట్లను చెలామణి నుంచి ఉపసంహరించుకుంటున్నట్లు 19 మే 2023న ఆర్‌బీఐ ప్రకటించింది. అయితే, త్వరలో దేశంలో రూ.500 నోట్లను కూడా ప్రభుత్వం రద్దు (చేయనుందంటూ ఓ వార్త తెగ వైరల్ అవుతోంది. 2026 మార్చి నాటికి రూ.500 నోట్లను ఆర్‌బీఐ చెలామణి నుంచి ఉపసంహరించుకుంటుందంటూ విస్తృతంగా ప్రచారం జరుగుతోంది.'కాపిటల్ టీవీ' అనే యూట్యూబ్ ఛానల్ దీనిపై వీడియో సైతం రిలీజ్ చేసింది. 2026 మార్చి నాటికి రూ.500 నోట్లు చాలామణీలో లేకుండా పోతాయని పేర్కొంది. 12 నిమిషాల నిడివిగల ఈ వీడియో సోషల్ మీడియాలో తెగ వైరల్ అయింది. ఈ ప్రచారంపై ప్రభుత్వానికి చెందిన పీఐబీ ఫ్యాక్ట్ చెక్ తాజాగా స్పందించింది. 'కేంద్ర ప్రభుత్వం ఇటీవలే రూ.2 వేల నోట్లను రద్దు చేసిన విషయం తెలిసిందే.

# మహారాష్ట్ర ఎన్నికల్లో బీజేపీ మ్యాచ్ ఫిక్సింగ్

మహారాష్ట్రలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మహాయుతి కూటమి మ్యాచ్ ఫిక్సింగ్ చేసి గెలుపొందిందని అన్నారు. రిగ్గింగ్ కు మహారాష్ట్ర ఎలక్షన్స్ సాక్ష్యం అని విమర్శించారు. త్వరలో బిహార్ లో జరగనున్న ఎన్నికల్లోనూ బీజేపీ ఇదే ప్లాన్ అమలు చేస్తుందని సంచలన వ్యాఖ్యలు చేశారు. గతేడాది మహారాష్ట్ర ఎన్నికల్లో మహాయుతి కూటమి ఏర్పడింది. కూటమిలో భాగంగా బేజేపీ, ఏక్ నాథ్ షిండే సారథ్యంలోని శివసేన, అజిత్ పవార్ సారథ్యంలోని ఎన్సీపీ విజయం సాధించాయి. కూటమికి 235 సీట్లు రాగా అందులో 132 సీట్లు కేవలం బీజేపీ మాత్రమే సాధించింది. ఈ క్రమంలో మ్యాచ్ ఫిక్సింగ్, రిగ్గింగ్ కారణంగానే మహారాష్ట్రలో కూటమి గెలిచిందని రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు చేశారు.ఎన్నికల్లో విజయం సాధించేందుకు బీజేపీ ఐదు సూత్రాలను పాటించిందని ఎక్స్ వేదికగా పోస్టు చేశారు. మొదటిది తమకు అనుకూలమైన ఎలక్షన్ కమిషన్ ను ఏర్పాటు చేయడం కోసం ప్యానెల్ ను రిగ్గింగ్ చేయడం రెండోది నకిలీ ఓటర్లను లిస్టులోకి దూర్చడం మూడోది వోటింగ్ టర్న్ అవుట్ లో మార్పులు నాలుగోది బోగస్ వోటింగ్ ఐదోది సాక్ష్యాలను దాచడం.. ఈ ఐదు స్టెప్స్ తో బీజేపీ కూటమి ఎన్నికల్లో విజయం సాధిస్తోందని రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు చేశారు. ఈ ఏడాది నవంబర్ లో బిహార్ లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. రాష్ట్రంలోని మొత్తం 243 సీట్లకు ఎన్నికలు నిర్వహించనుంది ఎలక్షన్ కమిషన్. ఇందుకు సంబంధించిన షెడ్యూల్ మరి కొద్ది రోజుల్లో వెల్లడి కానుంది.

# కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ ఆరోపణలు

ద్వారా కేవలం 11 టీఎంసీల నీళ్లు మాత్రమే నిల్వకు అవకాశం ఉండేది.కేసీఆర్ ముందు చూపుతో కాళేశ్వరం ద్వారా 141 టీఎంసీల నీరు నిల్వ ఉండేలా 16 రిజర్వాయర్లు నిర్మించాం. మేడిగడ్డ, అన్నరం, సుందిళ్ల, మేడారం, మల్కపేట, అనంతగిరి, రంగనాయక సాగర్, మల్లన్న సాగర్, కొండ పోచమ్మ సాగర్, బస్వాపూర్, గంధమల్ల, కొండం చెరువు, భూంపల్లి, మోతె, ధర్మారావుపేట, కాటేవాడి, ముద్దోజివాడి, తిమ్మక్కపల్లి రిజర్వాయర్లలో 141 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం ఉంది. ఒక్క మల్లన్న సాగర్ లోనే 50 టీఎంసీల నీటి నిల్వ ఉంటుంది. ఎస్సారెస్పీకి నీళ్లు రానపుడు, కడెం నిండకుండా ఎల్లంపల్లికి కూడా నీళ్లు రానపుడు, మేడిగడ్డలో నీళ్లుంటాయి. ఎక్కడా నీళ్లు లేనపుడు కూడా నీళ్లు లభ్యమయ్యే పాయింట్ మేడిగడ్డ. వర్షాలు బాగా కురిసినపుడు ఎస్సారెస్పీ నుంచి మిడ్ మానేరుకు నీళ్లు తెచ్చుకున్నం. మిడ్ మానేర్ లో పంప్ చేసి నుంచి అన్నపూర్ణ, రంగనాయక సాగర్, మల్లన్న సాగర్, కొండ పోచమ్మ సాగర్ వరకు నీళ్లు తెచ్చాం. కాళేశ్వరంలో అంతర్భాగమైన వీటి అంతటా లక్షల ఎకరాల్లో పంటలు పండినయి. కాళేశ్వరం ప్రాజెక్టులో కట్టిన మోటార్లతోనే అన్నపూర్ణకు నీళ్లు, అన్నపూర్ణలో పెట్టిన మోటార్లతో రంగనాయక సాగర్ కు నీళ్లు, రంగనాయక సాగర్ మోటార్లతో మిడ్ మానేర్ కు నీళ్లొచ్చాయి. మిడ్ మానేర్ మోటార్లతో మల్లన్నసాగర్ కు, అక్కడి మోటార్లతో కొండ పోచమ్మ సాగర్ కు నీళ్లిచ్చాం. ఇదంతా కాళేశ్వరంలో భాగంగానే లక్షల ఎకరాల్లో పంట పండింది. కాళేశ్వరం కింద ఒక్క ఎకరా పారలేదని సీఎం రేవంత్ రెడ్డి అంటడు. ఉత్తమ్ కుమార్ రెడ్డి 50 వేల ఎకరాలు మాత్రమే అన్నారు.

### 98,570 ఎకరాల కొత్త ఆయకట్టు

కాళేశ్వరం నీళ్లతో ఇప్పటి వరకు నేరుగా 98,570 ఎకరాల కొత్త ఆయకట్టుకు నీరందింది. కాళేశ్వరం ప్రాజెక్టు కాల్వల ద్వారా నింపిన 456 మైనర్ ఇరిగేషన్ ట్యాంకుల ద్వారా 39,146 ఎకరాల కొత్త ఆయకట్టుకు నీరందింది. కాళేశ్వరం ప్రాజెక్టు నీటితో ఎస్సారెస్పీ స్టేజీ 1, ఎస్సారెస్పీ స్టేజీ 2 మరియు నిజాంసాగర్ నీటితో నింపిన 2143 మైనర్ ఇరిగేషన్ ట్యాంకుల ద్వారా 1 లక్షా 67 వేల కొత్త ఆయకట్టు సాగయింది. ఎస్సారెస్పీ స్టేజీ 1, ఎస్సారెస్పీ స్టేజీ 2 మరియు నిజాంసాగర్ ప్రాజెక్టులకు కాళేశ్వరం నీరందించి 17 లక్షల 8 వేల ఎకరాల ఆయకట్టును స్థిరీకరించడం జరిగింది. కాళేశ్వరం నీళ్లు కూడెల్లి వాగు, హల్దీ వాగుల ద్వారా 66 చెక్ డ్యాములతో మరో 20 వేల 576 ఎకరాలకు సాగునీరందింది.

### ఇది వాస్తవమైన రిపోర్ట్..

ఒక ఏడాది కరువు వస్తే, ఎస్సారెస్పీకి కూడా నీళ్లను రివర్స్ పంపింగ్ చేశాం. మిడ్ మానేర్ నుంచి ఎల్ఎండీకి నీళ్లు తెచ్చి, ఎల్ఎండీ ద్వారా ఎస్సారెస్పీ స్టేజ్ 1 కు నీళ్లిచ్చాం. ఎస్సారెస్పీ స్టేజ్ 2లో, తుంగతుర్తి, సూర్యాపేట, కోదాడ దాకా నీరందించాం. కాళేశ్వరం నీళ్లు పంపించి పంటలు కాపాడింది కేసీఆర్ ప్రభుత్వం. ఇది వాస్తవమైన రిపోర్టు. ఎందుకంటే నీటిపారుదలశాఖ అధికారులిస్తున్న రిపోర్టు ఇది అని పేర్కొన్నారు. కానీ కాంగ్రెస్ నాయకులు 50 వేల ఎకరాలే పారిందని దుష్ప్రచారం చేస్తున్నరు. తెలంగాణ ఏర్పడక ముందు గోదావరి జలాల సద్వినియోగానికి ఎవరూ కృషి చేయలేదు. 2007 నుంచి 2014 వరకు కేంద్రంలో, మహారాష్ట్రలో, ఏపీలో కాంగ్రెస్ ప్రభుత్వాలే ఉన్నప్పటికీ తుమ్మడి హట్టి వద్ద ప్రాజెక్టు నిర్మాణం కోసం కేంద్రం నుంచి ఏ అనుమతి సాధించలేదు. బీఆర్ఎస్ పార్టీలా ఆలోచన చేసినం, తెలంగాణ పచ్చబడాలంటే గోదావరి జలాలే కావాలనుకున్నం. గోదావరి నది 1465 కిలోమీటర్లు ప్రవహిస్తుంటే, అందులో 750 కి.మీ. తెలంగాణలోనే ప్రవహిస్తుంది.

### అక్కడ నీటి లభ్యత ఉండదు

ఉమ్మడి ఏపీ రాష్ట్రంలో 1480 టీఎంసీల కేటాయింపులుంటే, తెలంగాణ వాటా 969 టీఎంసీలు. కానీ, వాస్తవంగా అందులో తెలంగాణ వాడకం ఏనాడూ 400 టీఎంసీలు మించలేదు. 2014 వరకు తెలంగాణలో గోదావరిపై కట్టిన ప్రాజెక్టులు ఎస్సారెస్పీ, దేవాదుల మాత్రమే. తెలంగాణ ఉద్యమం ఉప్పెనలా వస్తే, తలొగ్గిన కాంగ్రెస్ ప్రభుత్వం.. తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత - చేవెళ్ల ప్రాజెక్టుకు రూపకల్పన చేసింది. అక్కడ నీటి లభ్యత ఉండదు, ప్రాణహిత చేవెళ్ల నీటి నిల్వ సామర్థ్యం కేవలం 11 టీఎంసీలు మాత్రమే. కాళేశ్వరం ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 141 టీఎంసీలు ఎంత తేడా ఉందో మీరు గమనించండి. 2014 వరకు కాంగ్రెస్ నాయకులు సర్వే, మొబిలైజేషన్ అడ్వాన్సుల కింద రూ. 2328 కోట్లు కాంట్రాక్టర్లకు ఇస్తే, పనులు జరగనేలేదు. ఇందులో తట్టెడు మట్టి కూడా ఎత్తకుండా మొబిలైజేషన్ అడ్వాన్సుల పేరిట 1052 కోట్లు కాంగ్రెస్ ప్రభుత్వం స్వాహా చేసిందని స్వయంగా కాగ్ తన రిపోర్టులో వెల్లడించింది. ఇట్లా ఆ పైసలు కాంగ్రెస్ నాయకులు తీసుకొని జేబులు నింపుకున్నరు. అప్పుడు మంత్రులుగా ఉన్నది కూడా ఇదే కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి, శ్రీధర్ బాబులే. ఆనాడు రేవంత్ రెడ్డి తెలుగుదేశం పార్టీలో ఉండి విమర్శించిండు. జలయజ్ఞం కాదు, ధనం యజ్ఞం అని తీవ్ర ఆరోపణలు చేశారు. కానీ ఈరోజు రేవంత్ రెడ్డే గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అవినీతిని వెనకేసుకొస్తున్నడు.

### రూ.40,300 కోట్లకు పెంచింది కాంగ్రెస్

ఈ మధ్య ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడిండు. ప్రాణహిత చేవెళ్ల కోసం మేం 10 వేల కోట్లు ఖర్చు పెట్టినం, ఇంకో 20 వేల కోట్లు పెడితే అయిపోతుండె అన్నడు. నేను లెక్కలన్నీ తీయిస్తే, 3700 కోట్లు మాత్రమే కాంగ్రెస్ ఖర్చు చేసినట్లు తేలింది. ప్రాజెక్టు ఖర్చు పెరిగిందని ఈ కాంగ్రెస్ నాయకులు దుష్ప్రచారం చేస్తున్నరు. 2007లో రూ.17,875 కోట్లకు జీవో ఇచ్చి, ఏ పని చేయకుండానే ప్రాజెక్టు ఖర్చును రూ.38,500 కోట్లకు పెంచింది కూడా కాంగ్రెస్ మంత్రులే. ఆ తర్వాత కేంద్రానికి పంపినపుడు రూ.40,300 కోట్లకు పెంచింది కూడా ఇదే కాంగ్రెస్ నాయకులు. ఇదీ వీళ్ల నిర్వాకం. అని హరీష్ రావు అన్నారు.గతంలో తుమ్మిడిహెట్టి వద్ద నుంచి ఎల్లంపల్లికి నీళు తేద్దామనుకున్నారు. కానీ నీటి లభ్యత లేని కారణంగా తమ్మిటిహెట్టి నుంచి మేడిగడ్డ అక్కడి నుంచి అన్నారం, అటు నుంచి సుందిళ్లకు అక్కడి నుంచి ఎల్లంపల్లికి నీళ్లు తరలించాం. కాళేశ్వరానికి మేడిగడ్డ నుంచే నీళ్లు తేవాల్సిన అవసరం లేదు. ఎస్సారెస్పీకి వరద నీరు వస్తే మిడ్ మానేరుకు నీళ్లు వస్తాయి. ఒకటి వరద కాలువ, రెండోది ఎస్సారెస్పీ నుంచి మిడ్ మానేరుకు నీళ్లు వస్తాయి. మిడ్ మానేరు నుంచి మోటర్ల ద్వారా అన్నపూర్ణ, రంగనాయకసాగర్ రిజర్వాయర్, మల్లన్న సాగర్, కొండపోచమ్మ సాగర్ లకు నీళ్లు అందించే అవకాశం ఉందన్నారు.కొన్నిసార్లు కడెం ప్రాజెక్టు నుంచి ఎల్లంపల్లికి నీళ్లు వస్తాయి. ఎల్లంపల్లి నుంచి మోటార్లు ఆన్ చేసి ఎస్సారెస్పీకి నీళ్లు అటు నుంచి మిడ్ మానేరుకు నీళ్లు వచ్చేలా ప్లాన్ చేసినట్లు తెలిపారు. 2014 జూన్ 2 న తెలంగాణ రాష్ట్రం ఏర్పాటై, కొత్త ప్రభుత్వం ఏర్పడ్డది. నెల రోజుల్లోనే సాగునీటిశాఖ మంత్రిగా ఉన్న నేను, ఇంజనీర్ల బృందం కలిసి మహారాష్ట్రకు వెళ్లినం. అక్కడ కాంగ్రెస్ ఇరిగేషన్ మంత్రి హసన్ ముష్రఫ్ ను కలిసి ప్రాజెక్టు నిర్మాణం అవసరాన్ని వివరించినం. వారి సీఎం పృథ్వీరాజ్ చౌహాన్, ఇరిగేషన్ మంత్రి హసన్ ముష్రఫ్ ఉమ్మడి ఏపీ సీఎం కిరణ్ కుమార్ రెడ్డి రాసిన లేఖను గుర్తు చేశారు.

### మహారాష్ట్ర ప్రభుత్వం అంగీకరించలేదు

ఫుల్ రిజర్వాయర్ లెవల్ 152 మీటర్లకు అనుగుణంగా చేపట్టే ప్రాజెక్టు పనులు నిరుపయోగమని, తాము 148 మీటర్ల ఎత్తులో నిర్మిస్తేనే అంగీకరిస్తామని ఆనాడే తేల్చి చెప్పినట్లు చెప్పారు. ప్రాజెక్టు నిర్మాణం కోసం రెండు రాష్ట్రాల అధికారుల మధ్య రెండుసార్లు హైదరాబాదులో చర్చలు జరిగాయి. ఆనాడు దివంగత ఆర్.విద్యాసాగర్ రావు కూడా పాల్గొని మహారాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన పరిహారాన్ని తెలంగాణ ప్రభుత్వం ఇస్తుందని కూడా హామీ ఇచ్చారు. అయితే తుమ్మిడిహెట్టి వద్దనే 152 మీటర్ల ఎఫ్ఆర్ఎల్ తో ప్రాజెక్టు నిర్మించేందుకు బీఆర్ఎస్ ఎంతో ప్రయత్నం చేసింది. కానీ, మహారాష్ట్ర ప్రభుత్వం అంగీకరించలేదు. మహారాష్ట్రలో ఎన్నికలు జరిగిన తర్వాత కొత్తగా ఏర్పడిన బీజేపీ ప్రభుత్వంలో ఆనాటి సాగునీటి మంత్రి గిరీష్ మహాజన్ తో నేను (హరీష్ రావు) ముంబైలో సమావేశమవడం జరిగింది. ఈ సమస్యను ముఖ్యమంత్రుల స్థాయిలోనే పరిష్కరించుకోవాల్సి ఉంటుందని గిరీశ్ సూచించారు. ప్రాణహిత %-% చేవెళ్లను ఎందుకు రీ ఇంజనీరింగ్ చేయాల్సి వచ్చిందంటే నీటి లభ్యత లేకపోవడమే కారణం. హైడ్రాలజీ వాళ్లు అక్కడ ప్రాజెక్టుకు సరిపడా నికర జలాలు లేవన్నారు. ప్రాజెక్టుపై పునరాలోచన చేయాలని సెంట్రల్ వాటర్ కమిషన్ సూచించింది. ఉమ్మడి ఏపీలో 2008న రాసిన లేఖలో ప్రాణహిత చేవెళ్ల డీపీఆర్ పై సీడబ్ల్యూసీ స్పందించింది. ప్రాజెక్టులో నీటి నిల్వ సామర్థ్యం కలిగిన బ్యారేజీలు లేవని, అందుకే కృత్రిమ జలాశయాలను గానీ, ఆన్ లైన్ జలాశయాల నిల్వ సామర్థ్యాన్ని పెంచుకోవాలని సీడబ్ల్యూసీ సూచించింది. తుమ్మిడిహెట్టి వద్ద ప్రతిపాదించిన బ్యారేజీ నిర్మాణం కోసం ప్రభుత్వ పరంగా రాజకీయంగా ఎన్నో ప్రయత్నాలు చేసినం. అవేమీ ఫలించకపోవడంతోనే ప్రత్యామ్నాయ స్థలం కోసం ఆలోచన చేసినం. ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వ సంస్థ వ్యాప్కోస్ ఎంపిక చేసిన స్థలమే.. మేడిగడ్డ అని స్పష్టం చేసారు.

# మందులు లేని మహమ్మారితో జగన్ బాధపడుతున్నాడు

కలిసిపోవడం ఖాయమని హెచ్చరికలు జారీ చేశారు. మహిళలను ఇంత ఘోరంగా అవమానిస్తారా అంటూ విరుచుకుపడ్డారు. అమరావతి ముమ్మాటికి దేవతల రాజధానినే అంటూ మంత్రి నారా లోకేష్ స్పష్టం చేశారు. జగన్మోహన్ రెడ్డి మహిళలను ఇంత దారుణంగా అవమానిస్తారా అంటూ టార్గెట్ చేశారు.

### జగన్ దిగజారుడు తనానికి ఇది నిదర్శనం

జగన్ తన మీడియా సాక్షిగా మహిళలను ఘోరంగా అవమానించారని, ఇది ఆయన దిగజారుడుతనానికి నిదర్శనం అంటూ మండిపడ్డారు. అమరావతిపై విషం చిమ్మాలి అనుకుంటే అది తాడేపల్లి ప్యాలెస్ లోనే పడుతుందని ఆయన తేల్చి చెప్పారు. సాక్షి ఛానల్ లో చర్చ కార్యక్రమంలో ఓ వ్యక్తి అమరావతి మహిళలపైన అత్యంత అభ్యంతరకర వ్యాఖ్యలు చేయడం పైన నారా లోకేష్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

### మీ పతనానికి ఇది పరాకాష్ట

సోషల్ మీడియాలో స్పందించిన ఆయన తల్లుల ఆత్మ గౌరవాన్ని, అమరావతిని ద్వేషిస్తూ మీరు చేస్తున్న అసత్య ప్రచారం మీ పతనానికి పరాకాష్ట అంటూ మండిపడ్డారు. ఆకాశం మీద ఉమ్మి వెయ్యాలని ప్రయత్నిస్తే, అది మీ ముఖం మీద పడుతుందని తేల్చి చెప్పారు. అమరావతిపై విషం చిమ్మాలని చూస్తే అది తిరిగి మీ తాడేపల్లి ప్యాలెస్ కి చేరుతుందని తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

### జగన్ అనే సైతానును తరిమికొట్టిన ప్రాంతం అమరావతి

భూములు త్యాగం చేసిన తల్లుల అమరావతిపై మూడు రాజధానుల పేరుతో కుట్రలు చేస్తుంటే, జై అమరావతి అని నినదించిన శాంత మూర్తుల పవిత్ర స్థలం మన రాజధాని జగన్ అనే సైతానును తరిమికొట్టిన అన్ని మతాల దేవుళ్ళు దేవతలు కొలువైన ప్రాంతం అమరావతి అని పేర్కొన్నారు. కన్నతల్లిని సొంత చెల్లిని ఇంటి నుంచి పంపించేసిన దుర్మార్గుడు కి మహిళల త్యాగాలు వారి గొప్పతనం ఎలా అర్థమవుతాయి అంటూ లోకేష్ ప్రశ్నించారు.

### మహిళల జోలికి వచ్చినా, ఆడపిల్లలను వేధించినా చంద్రబాబు ఊరుకోరు

ముఖ్యమంత్రి చంద్రబాబు మహిళల భద్రత గౌరవం విషయంలో చాలా కఠినంగా వ్యవహరిస్తారు అంటూ లోకేష్ గుర్తు చేశారు. అంతేకాదు మహిళల జోలికి వచ్చినా, ఆడపిల్లలను వేధించిన వ్యాఖ్యలకు పాల్పడిన వారికి అదే ఆఖరి రోజు అని మా ముఖ్యమంత్రి చంద్రబాబు అనేకసార్లు హెచ్చరించారని గుర్తు చేశారు. విద్యార్థి దశ నుంచే మహిళలను గౌరవించడం నేర్పిస్తున్న మహిళల ఆత్మవిశ్వాసం దెబ్బ తినేలా మాట్లాడిన వారిని చట్టప్రకారం శిక్షిస్తున్నావు అని తెలిపారు.

### జగన్ రెడ్డి గారి బృందాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టేది లేదు

అమరావతిపై విషం చిమ్ముతున్న మహిళా లోకాన్ని కించపరుస్తున్న జగన్ రెడ్డి గారి బృందాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టేది లేదని తేల్చిచెప్పారు. రాష్ట్ర మహిళలను అవమాన పరుస్తూ క్షమించరాని నేరానికి పాల్పడిన జగన్ రెడ్డి గారు తక్షణమే బేషరతుగా మహిళా లోకానికి క్షమాపణ చెప్పాలని లోకేష్ డిమాండ్ చేశారు. రాష్ట్రంలో మహిళలను హింసించే మందులు లేని మహమ్మారితో బాధపడుతున్న జగన్ మాయరోగాన్ని పూర్తిగా నయం చేస్తామని దేవతల రాజధాని అమరావతి దయ్యం లాంటి జగన్ కు తగిన శాస్తి చేస్తుందని లోకేష్ హెచ్చరికలు జారీ చేశారు.

# చేప ప్రసాదం పంపిణీకి సర్వం సిద్ధం

సంఖ్యలో జనం వస్తున్నందున ప్రభుత్వం కూడా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది. ఈసారి కూడా ఆ ఏర్పాట్లు చేసింది. ఈసారి ప్రత్యేకంగా నాంపల్లి గ్రౌండ్‌కు వెళ్లేందుకు 140కిపైగా బస్సులను ఏర్పాటు చేసింది. వచ్చే వారు ఎలాంటి ఇబ్బంది పడకుండా కార్యక్రమం సజావుగా సాగేందుకు బారికేడ్లు ఏర్పాటు చేశారు. ఎటు నుంచి గ్రౌండ్‌లోకి వెళ్లాలి, ఎటు నుంచి ఎగ్జిట్ అవ్వాలని, వివిధ గమ్యస్థానాలకు ఎలా చేరుకోవాలనే విషయాలు తెలియజేస్తు ప్రత్యేక బోర్డులు ఏర్పాటు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి పబ్లిక్ ట్రాన్స్‌ఫోర్ట్ ద్వారా వచ్చే వాళ్లకు బస్‌లు సిద్ధం చేయడమే కాకుండా సొంత వాహనాల్లో వచ్చే వారికి కూడా ఏర్పాటు చేశారు. ప్రత్యేకంగా పార్కింగ్ సౌకర్యాలు చేపట్టారు. కార్లలో వచ్చే వాళ్లు ఎలా గ్రౌండ్‌లోకి రావాలి ఎలా ఎగ్జిట్ అవ్వాలో సూచిస్తున్నారు. ఎం జె మార్కెట్ వైపు నుంచి వచ్చే వాళ్లు గాంధీభవన్ వద్ద బస్ దిగాలి, నాంపల్లి నుంచి వచ్చే వాళ్లు గృహకల్ప వద్ద బస్ దిగాలి. ఈ 2 చోట్ల నుంచి గేట్ నెంబర్ 2కు వెళ్లాలి. చేప ప్రసాదం తీసుకునేందుకు వచ్చే వారు ఇబ్బంది పడకుండా ఉండటమే కాకుండా ఆ ప్రాంతం మీదుగా వెళ్లే వారు కూడా ఇబ్బంది పడకుండా ఉండేందుకు అధికారులు కొన్ని చర్యలు చేపట్టారు. నాంపల్లిలో రెండు రోజుల పాటు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. అసెంబ్లీ, రవీంద్ర భారతి వైపు నుంచి వచ్చే వాహనాలను బీజేఆర్ సర్కిల్ వైపు డైవర్ట్ చేశారు. అబిడ్స్ నుంచి వచ్చే వెహికల్స్‌ను ఎస్ ఏ బజార్ మసీద్ వైపు డైవర్ట్ చేశారు. అలస్కా జంక్షన్ నుంచి వచ్చే వాహనాలను మలకుంట జంక్షన్ వైపు డైవర్ట్ చేశారు. బేగం బజార్ నుంచి నాంపల్లి వైపు వెళ్లే ట్రాఫిక్ ను ఏక్ మినార్ నుంచి మళ్లిస్తున్నారు. ప్రక్రియను మరింత వేగవంతం చేసేందుకు ముందుగా టోకెన్లు పంపిణీ చేశారు. శనివారం రోజున ఎగ్జిబిషన్ గ్రౌండ్ వద్ద టోకెన్లు పంపిణీ చేశారు. వీటి కోసం జనం ఎగబడ్డారు. టోకెన్లు ఇస్తారని సమాచారం ప్రసార మధ్యమాల ద్వార తెలుసుకున్న ప్రజలు ఉదయాన్నే అక్కడకు చేరుకున్నారు.

# ఆటో డ్రైవర్లకు గుడ్ న్యూస్

ఈ నిర్ణయం, పట్టణ రవాణా వ్యవస్థలో ఒక విప్లవాత్మక మార్పునకు నాంది పలుకుతుంది. ఈ నూతన విధానం ప్రకారం ఓఆర్ఆర్ లోపల కొత్తగా ప్రవేశించే ఆటోలకు పరిమిత సంఖ్యలో మాత్రమే అనుమతులు లభిస్తాయి. ఇందులో ముఖ్యంగా ఎలక్ట్రిక్, సీఎన్‌జీ (కంప్రెస్డ్ నాచురల్ గ్యాస్), ఎల్‌పీజీ (లిక్విఫైడ్ పెట్రోలియం గ్యాస్) ఆటోలకు ప్రాధాన్యతనిచ్చారు. రవాణా శాఖ మంత్రి పొన్నం వెల్లడించిన వివరాల ప్రకారం కొత్తగా 20,000 ఎలక్ట్రిక్ ఆటోలకు అనుమతి లభించగా 10,000 ఎల్‌పీజీ ఆటోలకు అనుమతి వచ్చాయి. వీటితో పాటు 10,000 సీఎన్‌జీ ఆటోలకు కూడా అనుమతి లభించింది. ఈ చర్యల ద్వారా నగరంలో కాలుష్య ఉద్గారాలను తగ్గించవచ్చని, అదే సమయంలో ప్రయాణికులకు మెరుగైన, పర్యావరణ స్నేహపూర్వక రవాణా సౌకర్యాన్ని అందించవచ్చని ప్రభుత్వం భావిస్తోంది.

### రెట్రోఫిట్‌మెంట్ ద్వారా ఉపాధి కల్పన..

కేవలం కొత్త ఆటోలకే కాకుండా, ఇప్పటికే నగరంలో తిరుగుతున్న డీజిల్, పెట్రోల్ ఆటోల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం మరో ముఖ్యమైన నిర్ణయం తీసుకుంది. దాదాపు 25,000 డీజిల్, పెట్రోల్ ఆటోలను ఎలక్ట్రిక్, సీఎన్‌జీ, లేదా ఎల్‌పీజీ వాహనాలుగా మార్చుకోవడానికి (రెట్రోఫిట్‌మెంట్) అనుమతి మంజూరు చేసింది. ఇది పాత ఆటో డ్రైవర్లకు తమ ఉపాధిని కొనసాగించుకోవడానికి ఒక సువర్ణావకాశం. మంత్రి పొన్నం స్పష్టం చేసినట్లుగా ప్రభుత్వ ఆదేశాల వల్ల మొత్తం 65,000 కుటుంబాలకు ప్రత్యక్షంగా ఉపాధి అవకాశాలు లభిస్తాయి. ఈ రెట్రోఫిట్‌మెంట్ వల్ల ఆటో యజమానులకు ఇంధన ఖర్చులు తగ్గుతాయి, నిర్వహణ వ్యయం కూడా తగ్గుతుంది. ఇది వారి ఆదాయాన్ని పెంపొందించడంలో సహాయపడుతుంది.

### సుస్థిర పట్టణ రవాణా దిశగా..

ఈ సమగ్ర విధానం ద్వారా హైదరాబాద్‌లో పట్టణ రవాణా వ్యవస్థను ఆధునీకరించడం, పర్యావరణాన్ని పరిరక్షించడం, వేలాది మందికి స్థిరమైన జీవనోపాధిని కల్పించడం ప్రభుత్వ లక్ష్యంగా ఉంది. డీజిల్, పెట్రోల్ వినియోగాన్ని తగ్గించడం వల్ల కాలుష్యం తగ్గుతుంది, నగర వాతావరణం మెరుగుపడుతుంది. స్వచ్ఛమైన గాలి, తక్కువ శబ్ద కాలుష్యం వంటి ప్రయోజనాలు నగరవాసులకు అందుబాటులోకి వస్తాయి. ఈ చర్యలు భవిష్యత్తులో ఇతర పట్టణాల్లో కూడా ఇలాంటి సుస్థిర రవాణా విధానాలను అమలు చేయడానికి ఒక నమూనాగా నిలుస్తాయి.

# శిల్పారామంలో సాంస్కృతిక కార్యక్రమాలు

**శేర్లింగంపల్లి :** శిల్పారామం మాదాపూర్ లో వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా భరతనాట్యం మరియు కూచిపూడి నృత్య ప్రదర్శనలు ఎంతగానో అలరించాయి. చెన్నై నుండి విచ్చేసిన భరతనాట్య కళాకారిణి రాజేశ్వరి తన ప్రదర్శనలో స్వరజతి, జావళి, అర్ధనారీశ్వరం అంశాలను ప్రదర్శించి మెప్పించారు.

శ్రీముఖి నృత్యాలయా నాట్యగురువు కుమారి మనస్విని కోసూరు శిష్య బృందం కూచిపూడి నృత్య ప్రదర్శనలో రంగ పూజ, గజవదాన బెడువే, జయము జయము, ముద్దుగారే యశోద, గరుడ గమన, నారాయణతే నమో నమో, కృష్ణం కలయసఖి, కృష్ణ శబ్దం అంశాలను శ్రీ మనస్విని, అంజనా, రుక్మిణి, హిమశ్రీ, శ్రీలేఖ, భువన, సహస్ర, హారిణి, దివ్య శ్రీ, ఆరాధ్య, శ్రీనిక, రుత్విక, అన్విక, విజయ శ్రీ, పూర్వీక, మాన్విత, హరి హర మొదలైన కళాకారులూ ప్రదర్శించి మెప్పించారు.

# వాదంలో మంత్రి సవిత



**విజయవాడ** రాష్ట్ర మహిళా మంత్రి సవిత వివాదంలో ఉన్నారు. సి ఎస్ డి టి ఇచ్చిన బొకేను ఏపీ మహిళా మంత్రి సవిత విసిరి పారేశారు. దీనికి సంబంధించిన వీడియో ఇప్పుడు వైరల్ గా మారింది. అధికారులతో మంత్రి సవిత సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చేతన్ సమక్షంలో? పూల బొకేను ఏపీ మంత్రి సవిత విసిరి పారేశారు. ఈ సంఘటనకు సంబంధించిన వీడియో వైరల్ గా మారింది. ఈ సంఘటనపై ఏపీ ప్రజలు ఫైర్ అవుతున్నారు. బొకే ఇస్తే తీసుకోవాలి.. పక్కకు పెట్టాలి. లేకపోతే తన అధికారులకు ఇవ్వాలి కానీ ఇలా విసిరి పారేయడం ఏంటని.. ఫైర్ అవుతున్నారు జనాలు. మరి ఈ సంఘటనపై ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎలా స్పందిస్తారో చూడాలి.

# తిరుమల లడ్డు కల్తీ వ్యవహారం

## ధర్మారెడ్డిని అరెస్టు చేయాలి



**తిరుపతి** తిరుమల లడ్డు కల్తీ వ్యవహారంలో ఎంత పెద్ద వారైనా శిక్షలు అమలు చేయాలంటూ తిరుపతి జనసేన పార్టీ నాయకులు కిరణ్ రాయల్ కోరారు. అన్ని వ్యవస్థలను ధర్మారెడ్డి శాసిస్తూఎక చక్రాధిపత్యం కొనసాగిస్తున్నాడని ఆరోపించారు. తిరుమల లడ్డు కల్తీ వ్యవహారంలో అధికారులు వెంటనే స్పందించి ధర్మారెడ్డిని అరెస్టు చేయాలంటూ అయన అన్నారు. లడ్డులో ఏమాత్రం నెయ్యి లేకుండా కొన్ని రకాల పదార్థాలతో తయారు చేశారని ఆరోపించారు. తమ నాయకుడు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు ధర్మారెడ్డి కుతంత్రాలపై లేఖ రాస్తానని అన్నారు.

# రాయితీ విత్తనాలను పంపిణీ చేసిన మంత్రి కొండపల్లి

**విజయనగరం** గజపతినగరం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవర ణలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్ రాయితీ పై విత్తనాలు పంపిణీ చేశా రు. అనంతరం 80 శాతం రాయితీ తో ఎగ్రికల్చర్ డ్రోన్ పంపిణీ చేశారు. ఈసందర్భంగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ రైతులకు అన్ని విధాలుగా ప్రభుత్వం అండగా ఉంటు వ్యవసాయ లాభసాటిగా చేసేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపా రు. రైతులకు యంత్ర పరికరాలు, విత్తనాలు ఎరువులు రాయితీ పై అందజేస్తామని తెలిపారు. అనం తరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయు డు మాట్లాడుతూ నేరుగా రైతులు వద్దకే ఎరువులు విత్తనాలు అందిం చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మార్కె ట్ కమిటీ ఛైర్మన్ పి.వి వి గోపాల రాజు, వ్యవసాయ శాఖ జెడి వీటి రామారావు, మాజీ ఎంపీపీ గంట్యా డ శ్రీదేవి, కొండపల్లి భాస్కర్ నాయు డు తదితరులు పాల్గొన్నారు.

# ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగుల బంధువుల అందోళన

**ఖమ్మం** ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రి సూపరిండెంట్ రూమ్ వద్ద రోగి బంధువుల ఆందోళన చేశారు. బాత్ రూం లు శుభ్రం చేయకపోవడం, బయోవేస్ట్ క్లీన్ చేయకపోవడం నీరు రాకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నామని రోగుల బంధువులు ఆవేదన వ్యక్తం చేశారు. నీరు లేకుండా, పరిసరాలు శుభ్రంగా లేకుండా అప్పుడే పుట్టిన చిన్నారుల నుండి, గర్భిణీ స్త్రీల వరకు కొత్త రోగాలకు గురయ్యే అవకాశం ఉందని వాపోయారు.

సొంత డబ్బులతో బయటనుండి నీరు కొనుక్కోవాల్సి వస్తుందని. అధికారులకు ఎన్నిసార్లు చెప్పిన వినకపోవడంతో సూపరిండెంట్ రూం వద్ద ఆందోళన చేయడంతో సంభందిత అధికారులు వచ్చి సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

## దంపతులకు సర్దిచెప్పేందుకు వెళ్లిన

# మహిళకు కత్తిపోట్లు

**- పరిస్థితి విషమం**



**రంగారెడ్డి** మైలార్ దేవుపల్లి పోలీస్ స్టేషన్ పరిధి మధుబన్ కాలనీలో దారుణం జరిగింది. జుబేదా బేగం అనే మహిళను సలీం అనే వ్యక్తి కత్తితో పొడిచి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఘర్షణ పడుతున్న భార్యాభర్తలకు సర్దిచెప్పేందుకు జుబేదా వెళ్లింది. దాంతో సలీం మాకే నీతులు చెబుతావా అంటూ కోపోద్రిక్తుడైయాడు. ఇంట్లో ఉన్న కత్తితో జుబేదా పై దాడి చేసాడు. దాంతో జుబేదా తీవ్ర రక్తస్రావంతో అపస్మారక స్థితిలోకి వెళ్లింది. ఆమెను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. పోలీసులు నిందితున్ని అదుపులోకి తీసుకుని, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# భక్తిశ్రద్ధలతో బక్రీద్ పండుగ వేడుకలు



**తాండూర్:** తాండూర్ మండలంలో ముస్లిం సోదరులుఅత్యంత భక్తిశ్రద్ధలతో గురువారం బక్రీద్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు.

ఐబి, తాండూర్ తదితర ఏరియాలోని మసీదుల్లో నమాజులు చేసిన ముస్లింలు ఒకరికొకరు బక్రీద్ పండుగ శు భాకాంక్షలు తెలుపుకున్నారు. హిందూ ముస్లిం భాయి భాయి అని ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. త్యాగానికి బక్రీద్ పండుగ ప్రతీక అని ముస్లిం సోదరులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎండి ఈసా, ఎంపిటిసి సిరంగి శంకర్, కాంగ్రెస్ పార్టీ మండల్ యూత్ అధ్యక్షుడు పెట్టెం విష్ణు కళ్యాణ్, మైనార్టీ నాయకులు జుబైర్, ఆదాం ఖాన్, సర్వర్, లు తదితరులు పాల్గొన్నారు.

## పేదవాడి సొంతింటి కలను

# నిజం చేయడమే ప్రభుత్వ లక్ష్యం

- మొదటి విడతలో ఇళ్లు రానివారు ఆందోళన చెందొద్దు..
- అర్హులందరికీ దశల వారీగా ఇందిరమ్మ ఇళ్లను ఇస్తాం.
- వివిధ గ్రామాలల్లో ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారులకు పత్రాల పంపిణి
- బడిబాట కార్యక్రమ పోస్టర్ ను విడుదల చేసిన ఎమ్మెల్యే.



**జయశంకర్ భూపాలపల్లి** పేదవాడి సొంతింటి కలను నిజం చేయడమే సీఎం రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వ లక్ష్యమని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. శనివారం భూపాలపల్లి మండలంలోని అటవీ గ్రామాల్లో ఎమ్మెల్యే పర్యటించారు. కమలాపూర్, నాగారం, ఆజంనగర్, నందిగామ, పంబాపూర్, దూదేకులపల్లి, గొల్లబుద్దారం, రాంపూర్, ఆముదాలపల్లి, కొంపల్లి, గుడాడ్ పల్లి, గొర్లవీడు, వజినేపల్లి, నేరేడుపల్లి, ఎస్.యం కొత్తపల్లి, మోరంచపల్లి,



శ్యాంనగర్ గ్రామాలల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయా గ్రామాలల్లో ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారులకు మంజూరీ పత్రాలను జిల్లా హౌసింగ్ పీడీ లోకీలాల్ ఇతర అధికారులతో కలిసి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ముఖ్య అతిథిగా హాజరై పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలలో ఏర్పాటు చేసిన సభా వేదికలల్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ... పేదవాడి సొంతింటి కలను నిజం చేయడమే సీఎం రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వ లక్ష్యమని, ప్రజలకు ఉపయోగపడే పని చేస్తే వారి నుంచి వచ్చే స్పందన బాగుంటుందన్నారు. గత పాలకులు ఎమ్మెల్యే నివాసాలు, ప్రభుత్వ భవనాల మీద పెట్టిన శ్రద్ధ పేద ప్రజల ఇండ్లపై పెట్టలేదని, పేద ప్రజల సొంతింటి కలను విస్మరించిందని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రజాప్రభుత్వం రూ.22 వేల 500 కోట్ల రూపాయలను పేద ప్రజల సొంతింటి కల కోసం ఈ సంవత్సరం కేటాయించిందని, ఆర్థికంగా ఇబ్బందులు ఉన్నప్పటికీ పేదల సంక్షేమం అజెండాగా పాలన కొనసాగిస్తున్నామని అన్నారు. గుడిసెలో ఉంటున్న నిరుపేదలకు మొదటి విడతలో ప్రభుత్వం ఇండ్లు మంజూరు చేస్తుందని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం పారదర్శకంగా అమలు చేయాలని, ఎక్కడ లంచాలకు ఆస్కారం లేకుండా ఇండ్లు మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. రాజకీయపార్టీలకు అతీతంగా పేద, నిరుపేదలకు మొదటి విడతలో నిరోజకవర్గంలోని అన్ని గ్రామాలలో ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తున్నామని ఎమ్మెల్యే అన్నారు. ప్రభుత్వం పెట్టే ప్రతీ రూపాయి కూడా పేదలకు ఉపయోగపడాలని తాము ప్రయత్నిస్తున్నామని ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో ఇందిరమ్మ ఇండ్ల పథకం లబ్దిదారులు పలువురు మాట్లాడుతూ... గత పదేళ్లుగా సొంతింటి కోసం అనేక ప్రయత్నాలు చేసినప్పటికీ తమకు ఇళ్లు మంజూరు కాలేదని, సీఎం రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు సహాయంతో తమకు ఇండ్లు మంజూరు కావడం సంతోషంగా ఉందని పలువురు మహిళలు సంతోషం వ్యక్తం చేశారు. కమలాపూర్ గ్రామంలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమ పోస్టర్ ను విడుదల చేసిన ఎమ్మెల్యే.. రాష్ట్రంలో ఉన్న అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలను పెంచేందుకు విద్యాశాఖ ఈరోజు నుండి 19వ తేదీ వరకు ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. కాగా, ఆ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్ ను ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు కమలాపూర్ గ్రామంలో ఆవిష్కరించారు. ఈ నెల 19వరకు ఒక్కో రోజు ఒక్కో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు, ఆ కార్యక్రమాలను విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు విజయవంతం చేయాలని ఎమ్మెల్యే సూచించారు.

# వ్యవసాయంలో ఆధునిక పద్ధతులు తీసుకురావడానికే ఈ రైతు మహోత్సవం

**- అడిషనల్ కలెక్టర్ గరిమా అగర్వాల్**



**హుస్నాబాద్** శనివారం పదివేల మంది రైతులు హాజరయ్యారు 150 స్టాల్స్ ఏర్పాటు చేశారు వ్యవసాయ, వ్యవసాయన పరికరాల స్టాల్స్ వున్నాయి. ఫామ్ మెకనైజషన్ కు సంబంధించి యంత్రపరికరాలు కూడా స్టాల్స్ లో వున్నాయి బ్యాంకుల స్టాల్స్ కూడా వున్నాయి. ఎవరైనా ఈఎంఐ, కింద రుణాలు పొంది యంత్రాలు తీసుకోవచ్చు రైతులకు వివిధ అంశాలపై శిక్షణ తరగతులు జరుగుతున్నాయి. రైతులకు అధికారులు అవగాహన కల్పిస్తున్నారు సిద్ధిపేట జిల్లాలో ఆయిల్ పామ్ పరిశ్రమను కూడా త్వరలో ప్రారంభించుకోనున్నాం

## జగన్ మోహన్ రెడ్డి వెన్నుపోటు గురించి మాట్లాడటం విడ్డూరం



శ్రీకాళహస్తి(ప్రశ్న న్యూస్) శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల సుధీర్ రెడ్డి ఈ రాష్ట్రంలో వెన్నుపోట్ల చరిత్రను పరంపరను చూసుకుంటే ఆ మొదటి పాఠశాల మీ ఇంట్లోనే ఉన్నది మీ తాత నుంచి మీ తండ్రి మీ కుటుంబం మీ రాజకీయ జీవితం అంతా వెన్నుపోట్ల సాక్షిగా నిలుస్తుంది.మంగంపేట మైన్స్ హత్యల నుంచి పీవీ నరసింహారావు మీద చెప్పులు విసిరిన దాకా మీ చెల్లిని ఆస్తుల కోసం వదిలేసిన విధానం వివేకానంద రెడ్డి హత్య దాకా ఇవి వెన్నుపోటులు కావు జగన్మోహన్ రెడ్డి మీ కుటుంబ రాజకీయ విధానం ఇప్పుడు మా ప్రభుత్వం ఒకే ఏడాదిలోనే 70% హామీలు అమలు చేస్తూ పెన్షన్‌లు రోడ్లు బీసీ కార్పొరేషన్‌లు మత్స్యకారుల సేవా పథకాలు సామాజిక న్యాయానికి గౌరవంగా నిలుస్తున్న ఈ కూటమి ప్రభుత్వం మీద మీరు వెన్నుపోటు అనడం హాస్యాస్పదం కదా ఓటుతో అధికారం పొందిన కూటమి ప్రభుత్వం చెత్త పన్ను రద్దు చేసి రైతులకు బకాయిలు చెల్లించి ప్రతి వృద్ధుడికి ఉదయం 7 గంటలకే పెన్షన్ నేరుగా చేతిలోకి ప్రతి ఒక్కరికి అందిస్తోంది. ఇది వెన్నుపోటు కాదు జగన్ ఇది తెలుగుదేశం పార్టీ నైతికత విధేయత హామీలకు కట్టుబాటుతో నడిచే ప్రజా పాలన.మీ వెన్నుపోటు డ్రామాలకు ప్రజలు తలవంచే రోజులు పోయాయి.ఈ రాష్ట్రంలో వెన్నుపోటు అనే పదాన్ని వాడే ముందు మీ ఇంటి చరిత్రే ఒక్కసారి చదవండి. ప్రజలు ఆ డ్రామాలకు లోనవ్వరు.ప్రజలు చూస్తూ ఉన్నారు ప్రతిసారి మోసం చేసినవారిని కాదు వాగ్దానాలను నిలబెట్టినవారిని ఆశీర్వదిస్తారు. తెలుగుదేశం మాటలకోసం కాదు పనికోసం గుర్తుంచుకో జగన్మోహన్ రెడ్డి గుర్తుండే పార్టీ ఇది.

## బండపల్లిలో ఘనంగా బక్రీద్ వేడుకలు



వేములవాడ,(ప్రశ్న న్యూస్) వేములవాడ నియోజకవర్గం,చందుర్తి మండలంలోని బండపల్లి గ్రామంలో శనివారం బక్రీద్ (ఈద్–ఉల్–అజ్హా) పండుగను ముస్లిం సోదరులు ఘనంగా జరుపుకున్నారు. బండపల్లి – బావుసాయిపేట గ్రామాల మధ్య ఏర్పాటు చేసిన ఈద్గా వేదిక వద్ద ముస్లిం సోదరులు ప్రత్యేక నమాజ్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా మహమ్మద్ అజీమ్, మౌలానా, రావుఫ్, హుస్సేన్, అన్వర్, ఫిరోజ్ పాషా తదితరులు ప్రార్థనల్లో పాల్గొని పరస్పరం పండుగ శుభాకాంక్షలు తెలిపారు. సామరస్య వాతావరణంలో బక్రీద్ పండుగ జరుపుకోవడం అభినందనీయమని పలువురు గ్రామస్తులు పేర్కొన్నారు.

## మృతుని కుటుంబానికి పరామర్శ..! ప్రగాఢ సంతాపం..!!

**– 25 కిలోల బియ్యం అందజేత**

**– ఏఐటీయూసీ జిల్లా ప్రధానకార్యదర్శి : కడారి రాములు**




వేములవాడ, (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, వేములవాడ పట్టణ ఆటో యూనియన్ మాజీ అధ్యక్షులు బత్తుల దేవరాజ్ ఇటీవల మృతి చెందిన నేపథ్యంలో శనివారం మృతుడు దేవరాజ్ కుటుంబాన్ని ఏఐటీయూసీ జిల్లా ప్రధానకార్యదర్శి కడారి రాములు పరామర్శించి, ప్రగాఢ సంతాపాన్ని తెలియజేసి 25 కిలోల బియ్యం సంచీని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేవరాజ్ అకాల మృతి తీరని లోటు అని,ఆటో కార్మికునిగా పని చేస్తూ అనతి కాలంలోనే కార్మికుల మన్ననలు పొంది యూనియన్ అధ్యక్షునిగా బాధ్యతలు స్వీకరించి,ఆటో కార్మికుల సంక్షేమం కోసం ఆయన చేసిన కృషి మరువలేనిదన్నారు. వారి వెంట ఏఐటీయూసీ నాయకులు,తదితరులు ఉన్నారు.

## పెద్దమ్మ టెంపుల్ ను ప్రారంభించిన ఎంపీ ఈటెల రాజేందర్



మేడ్చల్ (ప్రశ్న న్యూస్) ఎల్లంపేట మున్సిపల్ పరిధిలోని బండ మాదారం గ్రామంలో నిర్మించిన పెద్దమ్మ టెంపుల్ ను మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ఎంపీ ఈటెల రాజేందర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వేద పండితులు ఎంపీ ఈటెల రాజేందర్ ను వేద మంత్రోచ్చారణల మధ్య ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వేద పండితులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీ ఈటెల రాజేందర్ తో పాటు పుర ప్రముఖులు హాజరయ్యారు

## ఓల్డ్ బోయిన్ పల్లిలో బాయ్ “ఈద్ముబారక్”:ముద్దం



కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్) ముస్లింలు అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకునే బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకొని ముస్లిం సోదరసోదరీమణులకు ఓల్డ్ బోయిన్ పల్లి డివిజన్ కార్పొరేటర్ ముద్దం నర్సింహా యాదవ్ బక్రీద్ శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే మాట్లాడుతూ దైవ ప్రవక్త ఇబ్రహీం త్యాగాలను గుర్తుచేసుకుంటూ ఈ పండుగను ముస్లిం సోదరులు ఉత్సాహంగా జరుపుకుంటారని, రంజాన్ పండుగ ధానధర్మాలకు ప్రతీక అయితే, బక్రీద్ పండుగ త్యాగానికి ప్రతీక అని,స్వార్థం, అసూయలను విడిచిపెట్టి మానవత్వాన్ని వెదజల్లాలన్నదే బక్రీద్ పండుగ పరమార్ధమని అన్నారు ముద్దం.బోయిన్ పల్లి ప్రాంతంలో ఉన్న మజీద్ లన్నీ మైనారిటీల ప్రార్థనలతో నిండిపోయాయి.వందాలది మంది ముస్లిం సోదరులు బక్రీద్ పండుగ సంధర్భంగా ఒకరినొకరు కౌగలించుకొని శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. అలిగే పలు మజీద్ లల్లో ప్రముఖులతో కోలాహలంగా మారింది. మత పెద్దలు ఆశీస్సులు తీసుకున్న స్థానిక కార్పొరేటర్ ముద్దం నర్సింహా యాదవ్.అలాగే ఓ మైనారిటి వ్యక్తిని చూసి బాయ్ ఈద్ ముబారక్ అంటూ ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలియజేశారు.

## రేవంత్ రెడ్డి క్యాబినెట్ లో ఆది శ్రీనివాస్ కు చోటు కల్పించాలి

**– 21 వ వార్డు కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి : కోయల్కార్ మస్తాన్ విజ్ఞప్తి**



వేములవాడ,(ప్రశ్న న్యూస్) తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గ విస్తరణలో భాగంగా బీసీ సామాజికవర్గానికి న్యాయం జరగాలని కోరుతూ, వేములవాడ శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కు మంత్రి పదవి కల్పించాలని వేములవాడ మున్సిపల్ పరిధిలోని 21వ వార్డు కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కోయల్కార్ మస్తాన్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మస్తాన్ మాట్లాడుతూ ౦ “తెలంగాణ రాష్ట్ర నిర్మాణంలో, కాంగ్రెస్ పార్టీ బలపడటంలో బీసీ వర్గం పాత్ర అపారంగా ఉంది. ప్రస్తుతం జరుగనున్న మంత్రివర్గ విస్తరణలో బీసీలకు గౌరవప్రదమైన ప్రాతినిధ్యం కల్పించాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్‌బీసీ వర్గానికి చిరునామాగా, ప్రజల్లో విశ్వాసాన్ని సంపాదించుకున్న నేత. ఆయనకు మంత్రి పదవి ఇవ్వడం ద్వారా పార్టీని మరింత బలోపేతం చేయొచ్చు. మా ఈ విజ్ఞప్తిని సీఎం రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందిస్తారని ఆకాంక్షిస్తున్నాం” అని తెలిపారు.

## వెంకట్రావుపల్లిలో బడిబాటతో విద్యా చైతన్యం

**– ప్రభుత్వ పాఠశాలలపై ప్రజలకు విశ్వాసం పెరుగుతోంది**

**– ప్రధానోపాధ్యాయులు : తిరుపతి**



బోయినిపల్లి,(ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా,బోయినిపల్లి మండలంలోని వెంకట్రావుపల్లి గ్రామంలో “బడిబాట” కార్యక్రమాన్ని ఎంతో ఉత్సాహంగా నిర్వహించారు. ఆరవ తరగతి నుంచి పదవ తరగతి వరకు కొత్త అడ్మిషన్ల కోసం ఇంటింటి ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా బడి బాట కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు తిరుపతి,సహాయ ఉపాధ్యాయులు నర్సయ్య, పద్మ,వనజ,దేవి తదితరులు పాల్గొన్నారు. గ్రామ ప్రజలు కూడా చురుకుగా పాల్గొని విద్యాభివృద్ధికి సహకారం అందించారు.ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు తిరుపతి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న బడిబాట కార్యక్రమంతో విద్యా చైతన్యం కలిగిందని, ప్రజలకు ప్రభుత్వ పాఠశాలలపై విశ్వాసం పెరుగుతుండడం హర్షణీయమని,ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించబడుతుంది. ప్రతి సంవత్సరం మా పాఠశాలలో 100% ఉత్తీర్ణత సాధిస్తున్నాము. ట్రిబుల్ ఐటీలలో మా విద్యార్థులు సీట్లు సాధిస్తున్నారు. పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ ఉచితంగా అందించడంతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు, శారీరక వ్యాయామాలు, కరాటే, వాలీబాల్, కబడ్డీ, కోకో లాంటి క్రీడలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాము. అంతేకాదు, ఇంటర్నెట్ ఆధారిత విద్యా పద్ధతులను కూడా పాఠశాలలో ప్రవేశపెట్టాం,” అని తెలిపారు.గ్రామస్థులు, తల్లిదండ్రులు ఈ కార్యక్రమాన్ని అభినందించారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం ప్రభుత్వ పాఠశాలలు ఉత్తమ వేదికగా ఉండటాన్ని వారు ప్రశంసించారు.

## త్యాగానికి ప్రతీక బక్రీద్ పర్వదినం : మునిగొండ శేఖర్



మేడ్చల్ (ప్రశ్న న్యూస్) బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకొని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఆరిఫ్ తన స్వగృహంలో శనివారం ఏర్పాటు చేసిన బక్రీద్ వేడుకల్లో పాల్గొని కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ జిల్లా ఓబీసీ సెల్ కన్వీనర్ మునిగొండ శేఖర్ బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మునిగొండ శేఖర్ మాట్లాడుతూ బక్రీద్ ఒక అపూర్వమైన పండుగ అని హజ్రత్ ఇబ్రాహీమ్, హజ్రత్ ఇస్మాయిల్ అలైహిస్సలాంల త్యాగాలను స్మరించుకునే త్యాగోత్సవం అని పేర్కొన్నారు. మనిషి తనను తాను తగ్గించుకొని, వినమ్రపూర్వకంగా అల్లా ఔన్నత్యాన్ని, ఆయన ఘనతను కీర్తించే గొప్పరోజని తెలిపారు. ఏ సంతోషకార్యమైనా నలుగురితో పంచుకోవాలని, కేవలం మన గురించి మాత్రమే కాకుండా సమాజం గురించి ఆలోచించాలని తెలిపే గొప్ప పండుగ అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డబిల్ పూర్ గ్రామ మాజీ సర్పంచ్ సంజీవ రావు, శ్రీరాం రెడ్డి, సాయి బాబా గౌడ్, శ్రీనివాస్ గౌడ్, ఇమ్రాన్, దుద్దు సందీప్, వెంకటేష్, మురళి, బాలు, శంకర్, చింటూ తదితరులు పాల్గొన్నారు.

## అమ్మ పేరుతో ఒక మొక్క



శ్రీకాళహస్తి(ప్రశ్న న్యూస్) ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పిలుపు మేరకు జూన్ 5 నుంచి ఆగస్టు 15 వరకు ప్రతి ఒక్కరమూ మన మాతృమూర్తి పేరిట ఒక మొక్క నాటుదాం.దాన్ని పరిరక్షిస్తూ పర్యావరణాన్ని కాపాడుకుందాం.నేడు శ్రీకాళహస్తి పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు పట్టణ అధ్యక్షుడు హరీష్ రెడ్డి కోలా ఆనంద్ కుమార్ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటడం జరిగింది ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నారెడ్డి దయాకర్ రెడ్డి తిరుపతి జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## రాహు కేతు పూజలో పాల్గొన్న సినీ నటి వరలక్ష్మి



శ్రీకాళహస్తి(ప్రశ్న న్యూస్) శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహించే మహిమా నిత్య రాహు కేతు దోష నివారణ పూజలను సినీ నటి వరలక్ష్మి కుటుంబ సభ్యులతో కలసి ఆలయం కు విచ్చేశారు. శనివారం సహస్ర లింగం వద్ద 5 వేల రూపాయల ప్రత్యేక రాహు కేతు కాల సర్ప దోష నివారణ పూజలు నిర్వహించుకున్నారు వారికి దక్షిణ గోపురం వద్ద ఆలయ అధికారులు స్వాగతం పలికారు తరువాత స్వామి అమ్మవార్ల ఆలయాల్లో అంతరాలయ దర్శనం ఏర్పాటు చేశారు. అనంతరం వేద పండితులచే ప్రత్యేక ఆశీర్వచనం స్వామి అమ్మవార్ల చిత్ర పటం తీర్థ ప్రసాదాలు ఆలయ అధికారులు అందజేశారు.

## ఆగ్నేయ గణపతి బాలాలయం అంకురార్పణ



శ్రీకాళహస్తి(ప్రశ్న న్యూస్) ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానానికి అనుబంధ ఆలయమైన మూడవ మాడవీధిలో ఉన్న ఆగ్నేయ గణపతి స్వామికి దేవస్థానం ప్రధాన అర్చకుల ఆధ్వర్యంలో బాలాలయం అంకురార్పణ కార్యక్రమాన్ని ప్రారంభించి విశేష పూజలు నిర్వహించిన అనంతరం పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో దేవస్థానం డిప్యూటీఈవో ఎన్.ఆర్ కృష్ణారెడ్డి, సూపర్డెంట్ నాగభూషణం యాదవ్ ప్రధాన ఆర్చకులు కరుణాకర్ గురుకుల్,ఉప ప్రధాన అర్చకులు దక్షిణామూర్తి ఆలయ అధికారులు సిబ్బంది భక్తులు పాల్గొన్నారు.

## ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి సేవలను సీఎం రేవంత్ రెడ్డి గుర్తించాలి

**– ఎస్సీ సామాజిక వర్గానికి ప్రాధాన్యత కల్పిస్తూ ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరికి మంత్రి పదవి కేటాయించాలి**

**– ఎస్సీ,ఎస్టీ ఉప సర్పంచుల ఫోరం ఉమ్మడి కరీంనగర్ జిల్లా మాజీ అధ్యక్షులు : బండపల్లి అంజన్ కుమార్**



కొడిమ్యాల,(ప్రశ్న న్యూస్) ధర్మపురి నియోజకవర్గం ఎమ్మెల్యే,ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కు ఎస్సీ సామాజిక వర్గం నుంచి ప్రాధాన్యత కల్పిస్తూ తెలంగాణ రాష్ట్ర మంత్రి వర్గ విస్తరణ లో చోటు కల్పించాలని ఎస్సీ, ఎస్టీ ఉప సర్పంచుల ఫోరం మాజీ ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షులు, సాయి హర్షిణి ఏజెన్సీస్ మేనేజింగ్ డైరెక్టర్ బండపల్లి అంజన్ కుమార్ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి యావత్ ఎస్సీ సామాజిక వర్గం పక్షాన విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 30 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీ నే నమ్ముకొని పార్టీ ఫిరాయింపుల కు తావు లేకుండా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి, పార్టీ బలోపేతం అయ్యేందుకు ఆయన చేసిన కృషిని కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం గుర్తించి రేవంత్ రెడ్డి క్యాబినెట్ లో స్థానం కల్పించాలని బండపల్లి అంజన్ కుమార్ విజ్ఞప్తి చేశారు.

# తెలంగాణ సాధించిన కేసీఆర్ ను తిట్టడానికి ముఖ్యమంత్రి సభ పెట్టుకున్నాడు

**కేసీఆర్ ను తిట్టడాన్ని ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నాం**
**గంధమల్లను కొత్తగా తీసుకువచ్చారా ఆగ్రహం వ్యక్తం చేశారుబీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర రైతు విభాగం ప్రధాన కార్యదర్శిగొంగిడి మహేందర్ రెడ్డి**



యాదగిరిగుట్ట(ప్రశ్న న్యూస్) యాదగిరి గుట్ట పట్టణంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో గొంగిడి మహేందర్ రెడ్డి మాట్లాడుతూ కాళేశ్వరంలో అంతర్భాగమే గంధమల్ల ఈ ప్రాంతానికి సాగు నీటి కోసం గంధమల్లను డిజైన్ చేశారు.అప్పుడు రైతులను రెచ్చగొట్టి ప్రాజెక్టు నిర్మాణానికి అడ్డుపడ్డారు. గతంలో గుత్తా అమిత్ రెడ్డికి టెండర్ దక్కింది. అప్పుడు పనులు ప్రారంభం అయ్యాయి ఎన్నికలు రావడంతో పనులు పెండింగ్ పడ్డాయి.బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకువచ్చిన



గంధమల్లకు మళ్లీ శంకుస్థాపన చేయడం సిగ్గుచేటు. నాడు కాంగ్రెస్ నాయకులు అడ్డం పడిన ప్రాజెక్టు ఇప్పుడు నిర్మిస్తారా కాళేశ్వరం కూలిపోయింది అని అబద్దాలు చెప్పారు ఎల్లంపల్లి నుంచి ఏ విధంగా గంధమల్లను నిర్మాణం చేస్తారో చెప్పాలి ప్యాకేజీ 15 ద్వారా గంధమల్ల డిజైన్ చేశారు. మల్లన్న సాగర్ ద్వారా నీళ్ళు గంధమల్లకి రావాలి మల్లన్న సాగర్ కాకుండా గంధమల్లకు ఏ విధంగా నీళ్ళు తీసుకువస్తారో తీసుకురండి.అబద్దాలతో ముఖ్యమంత్రి సభను సాగించారు చేసిన పనులకే శంకుస్థాపన చేయడం అనేది సిగ్గు చేటు అన్నారు మహేందర్ రెడ్డి మల్లాపురంలో మెడికల్ కళాశాల కోసం స్థలం కేటాయించారు.ఎమ్మెల్యే చేతకాని తనంతో భువనగిరిలో కళాశాల కొనసాగిస్తున్నారు మెడికల్ కళాశాల ఎక్కడ పెడుతున్నారనే అంశం పై క్లారిటీ లేదు యాదాద్రిని యాదగిరిగుట్ట గా మార్చడాన్ని ఏవరు స్వాగతించలేదు.కేసీఆర్ 22సార్లు ఆలయాన్ని సందర్శించి అద్భుతంగా యాదగిరి క్షేత్రాన్ని పునః నిర్మాణం చేశారు. రెండు వందల సంవత్సరాలైనా కేసీఆర్ పేరు యాదగిరి క్షేత్రంగా పేరు ఉంటుంది.కేసీఆర్ సంపద సృష్టిస్తే కాంగ్రెస్ కొల్లగొడుతున్నారు.మూడు సార్లు సీఎం వచ్చినా ఒక్క రూపాయి కేటాయించలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాత ఒక్క పైసా యాదగిరిగుట్ట దేవస్థానానికి నిధులు కేటాయించలేదు విమాన గోపురానికి బంగారు తాపడానికి ఏమైనా బంగారం రేవంత్ రెడ్డి ఇచ్చాడా బీర్ల ఐలయ్య, కోమటిరెడ్డి, చామల, ఉత్తమ్, కొండా సురేఖ, సీఎం ఏవరు ఇసమెత్తు బంగారం కూడా ఇవ్వలేదు కేసీఆర్ ఆనవాళ్ళు లేకుండా చేయడం ఏవరి తరం కాదు.గంధమల్ల ప్రాజెక్టు, మినీ శిల్పారామం, యాదగిరి ఆలయం, మండలాలకు రోడ్లు ఇవ్వన్ని కేసీఆర్ ఆనవాళ్ళే.పోలీసులు, అధికారులు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారు.పోలీస్ అధికారులను పెట్టి సభకు తరలించారు. సీఎం మాట్లాడుతుంటే, కేసీఆర్ ను తిడుతుంటే ప్రజలు బాధపడుతున్నారు రైతు రుణమాఫీ పూర్తిగా ఇవ్వకపోవడంతోనే రైతులు ఏవరు సభకు రాలేదు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజలు ఏవరు సంతోషంగా లేరు.కాంగ్రెస్ సభ అట్టర్ ఫ్లాప్ జరిగింది అని మహేందర్ రెడ్డి అన్నారు

# దేవస్థాన మాడవీదులు, క్యూ లైన్స్ పరిశీలించిన ఈఓ వెంకట్రావు

**- భక్తుల రద్దీ అధికముగా ప్రదేశములలో కూల్ వాటర్, మజ్జిగ పంపిణీ ఏర్పాట్లు**



యాదగిరిగుట్ట(ప్రశ్న న్యూస్) యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు.వేసవి సెలవులతో పాటు శనివారం సెలవు రోజు కావడంతో అధిక సంఖ్యలో స్వామి వారి ఆలయానికి భక్తులు తరలి వచ్చారు.ఆలయ ప్రాంగణంలో భక్తుల సందడి నెలకొంది.క్యూ లైన్లు భక్తులు బారులు తీరారు.దీంతో ఉచిత ప్రవేశ దర్శనానికి దాదాపు మూడు గంటలకు సమయం,ప్రత్యేక ప్రవేశ దర్శనానికి దాదాపు రెండు గంటల సమయం పడుతుంది.ఆర్జిత సేవలు, నిత్యా పూజల్లో పాల్గొని భక్తులు మొక్కులు తీర్చుకుంటున్నారు.భక్తుల రద్దీ అధికంగా ఉండటంతో



ఆలయ పరిసరాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి.నిత్యా కల్యాణం,లడ్డు ప్రసాదం కౌంటర్లు,సత్యనారాయణ స్వామి వ్రత మండపం,కొండక్రింద కల్యాణ కట్ట,పుష్కరిణి,వాహనాల పార్కింగ్ వద్ద భక్తుల సందడి నెలకొంది. భక్తులు తమ అమూల్య సలహాలు సూచనలు ఫిర్యాదులు అందజేయుటకు భక్తులకు అందుబాటులోప్రధాన కార్యాలయము, ఆలయము, రిసెప్షన్, ప్రసాద విక్రయము వద్ద సూచనలు, సలహాలు, ఫిర్యాదుల బాక్స్ ఏర్పాటు చేయించుట జరిగినది

# సాకేత్ భూ సత్వ ఫేజ్-1లో విల్లాలు కొనుగోలు చేసి మోసపోయాం

## - సాకేత్ భూ సత్వ ఫేజ్-1 విల్లాలా నివాసితులు

- ప్రాజెక్ట్ మొదలై 14 ఏళ్లు గడిచినా కనీస సౌకర్యాలు కల్పించలేదు
- తమ గోడును సైతం వెలుగులోకి తీసుకురావాలని కోరిన భూసత్వ నివాసితులు
- బిల్డర్ దురాశ ప్రయత్నాలు అడ్డుకుంటే కొత్త సమస్యలు సృష్టిస్తున్నారు
- అక్రమాలను ఎదుర్కొన్న వారిపై తప్పుడు కేసులు బనాయించారు
- నీటి సౌకర్యం కోసం రూ.75 వేల నుండి రూ.లక్ష వరకు ప్రతి విల్లా యజమాని నుండి వసూలు చేశారు








**మేడ్చల్ (ప్రశ్న న్యూస్)** గుండ్లపోచంపల్లి పురపాలక సంఘం పరిధిలోని సాకేత్ భూ సత్వ ఫేజ్-1లో విల్లాలు కొని మోసపోయామని సదరు విల్లాలా నివాసితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రాజెక్ట్ మొదలై 14 ఏళ్లు గడిచినా, హెచ్ఎండిఏ ఇచ్చిన గడువు 2022 జూన్ 17 నాటికి దాటినా ప్రాజెక్ట్ లోని కనీస సౌకర్యాలు కల్పించలేదని పేర్కొన్నారు. భూ సత్వ సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేశ్వర్లు, ప్రదీప్ మాట్లాడుతూ సాకేత్ బిల్డర్లు తమను అన్ని విధాలా మోసం చేశారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. గేటెడ్ కమ్యూనిటీ ప్రాజెక్ట్ విల్లాలను ఓపెన్ ప్లాట్ ప్రాజెక్ట్ తో నిబంధనలకు విరుద్ధంగా కలిపి అమ్మారని, పరిమిత సౌకర్యాలు తమకు ఉన్నాయని, వాటిని ఓపెన్ ప్లాట్స్ కొన్నవారిని వాడుకోమన్నారని, ఫలితంగా ఇరువురి మధ్య విభేదాలు తలెత్తాయని తెలిపారు. బిల్డర్ దురాశ ప్రయత్నం అమలు కాకుండా అడ్డుకుంటే రోజు రోజుకు కొత్త సమస్యలు సృష్టిస్తున్నారని ఆరోపించారు. అక్రమాలను ఎదుర్కొన్న వారిపై తప్పుడు కేసులు బనాయించారన్నారు. పురపాలక సంఘం నుంచి నీటి సౌకర్యం కొరకు రూ. 75 వేల నుండి రూ.లక్ష వరకు ప్రతి విల్లా యజమాని నుండి సేకరించి కలుషిత నీటిని సరఫరా చేస్తున్నారని ఫలితంగా నివాసితుల ఆరోగ్యం దెబ్బతిని అనారోగ్యాల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత చాలా ఏళ్ళుగా కమ్యూనిటీ మెయింటనెన్స్ దారుణంగా ఉందని, మెయింటైనెన్స్ చార్జెస్ వివరాలు తెలుపాలని పలుమార్లు బిల్డర్ ను కోరినా స్పందించకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని వాపోయారు. ఈ సమావేశంలో కోపరేటివ్ సొసైటీ అధ్యక్షులు వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షురాలు సవిత , ప్రదీప్ కుమార్, సురేష్, అరుణాచలం, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ ఆరోగ్య భద్రత దినోత్సవం రోజు ఆసుపత్రి పాలైన జయంతి

- ఫాస్ట్ ఫుడ్ సెంటర్లలో ఇష్టారాజ్యంగా ఆహార పదార్థాల తయారీ
- ఆకర్షణ కోసం రసాయనిక రంగుల వినియోగం
- రుచికోసం టెస్టింగ్ సాల్ట్ వాడుతున్న వైనం
- రాత్రి మిగిలిపోయిన పదార్థాలు పగలు వడ్డింపు
- ఫాస్ట్ ఫుడ్ సెంటర్లలో రేట్లు ప్రియం. నాణ్యత శూన్యం.
- జంతువులు సైతం తినలేని కుళ్లిపోయిన మాంసంతో వంటకాలు
- కానరాని కనీస నిబంధనలు, నాణ్యతా ప్రమాణాలు
- అధికారులు సీజ్ చేస్తున్న పట్టించుకొని చాయ్ అమృత్
- చికెన్ నూడిల్స్ తిని ఆస్పత్రి పాలైన జయంతి
- ఆహారం మనషికి జీవనాధారం... సరైన ఆహారం లేకపోతే జీవించడం కష్టతరం..



**ఓ ంకంగా చెప్పాలంటే ఆహారమే మనిషికి చక్కని ఔషధం.. అయితే ఈ విషయం గురించి ఎవరు పట్టించుకుంటున్నట్లు కనిపించడం లేదు. ప్రస్తుత దయనందిన జీవితంలో ప్రతీ ఒక్కరూ తినడం అంటే కడుపు నింపుకోవడం అనుకుంటున్నారు. కాసుల వేటలో పడి కనీస విషయాలు కూడా తెలుసుకోవడం లేదు. దీంతో రోజు రోజుకి ఆరోగ్య సమస్యలు ఎక్కువవుతున్నాయి. మరి మనిషి ఆరోగ్యంగా ఉండాలంటే ఎటువంటి భోజనం తినాలి, ఏ ఏ సమయాలలో తినాలి అనే నియమాల గురించి ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రతీ సంవత్సరం జూన్ 7వ తేదీన ప్రపంచ ఆహార భద్రతా దినోత్సవంగా జరుపుకుంటున్న రోజే నాణ్యతలేని ఆహారం తిని మహిళ ఆసుపత్రి పాలైన సంఘటన మేడ్చల్ పురపాలక సంఘం పరిధిలో చోటుచేసుకుంది**




**మేడ్చల్ (ప్రశ్న న్యూస్)** ప్రజారోగ్యంతో తినుబండారాల వ్యాపారులు చెలగాటమాడుతున్నారు. ముఖ్యంగా మేడ్చల్ పట్టణంలోని పలు ఫాస్ట్ ఫుడ్ నిర్వాహకులు తమ వంటల్లో కుళ్లిపోయిన మాంసం వాడుతూ ప్రజల ఆరోగ్యంతో లక్షల వ్యాపారం నిర్వహిస్తున్నారు. రోజుల తరబడి నిల్వ ఉన్న ఆహారాన్ని వేడివేడిగా వంట చేసి ప్రజలకు వడ్డించడంతో ఆ పదార్థాలు తిన్న ప్రజలు ఆస్పత్రుల పాలవుతున్నారు. కాసుల మత్తులో కునారిల్లుతున్న ఫాస్ట్ ఫుడ్ సెంటర్ల యజమానులు ప్రజారోగ్య విషయాన్ని పెడచెవిన పెట్టి, నాణ్యతా ప్రమాణాలు లేని ఆహారాన్ని వినియోగదారులకు వడ్డిస్తున్నారు. దీంతో వ్యాపారులకు ఆదాయం దండిగా ఉన్నా, ప్రజలు మాత్రం అనారోగ్యాల భారిన పడుతున్నారు. రుచి, ఆకర్షణ కోసం వివిధ రకాల రంగులు, ఇతర రసాయనాలను వినియోగించడంతో వాటి ప్రభావం ప్రజల ఆరోగ్యంపై పడుతోంది. మేడ్చల్ పట్టణంలో నిర్వహించే ఫాస్ట్ ఫుడ్ సెంటర్లలో భోజనాలకు వెళితే అనారోగ్యాన్ని కొని తెచ్చుకోవాల్సిన దుస్థితి పురపాలక సంఘం పరిధిలోని ప్రజలకు నెలకొంది. మేడ్చల్ పురపాలక సంస్థ పరిధిలోని ఆహారభద్రత శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించకపోవడంతో పలు ఫాస్ట్ ఫుడ్ సెంటర్ల వ్యాపారం మూడు పువ్వులు, ఆరు కాయలుగా సాగుతోంది. పురపాలక సంఘం పరిధిలో ఇంత ఆహార కల్తీ జరుగుతున్న పట్టించుకోవాల్సిన ఫుడ్ సేఫ్టీ అధికారులు పట్టించుకోకపోవడంతో సదరు ఫాస్ట్ ఫుడ్ సెంటర్ల నిర్వాహకులు అడ్డగోలుగా రెచ్చిపోతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో ఫాస్ట్ ఫుడ్ సెంటర్ల యజమానులకు ఆడిందే ఆట, పాడిందే పాటగా కొనసాగుతోంది. పూర్తిగా కుళ్ళిపోయిన మాంసంకు మసాలా దట్టించి వండి వడ్డిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రధానంగా మాంసాహార హెరీటల్ నిర్వహిస్తున్న పలు ఫాస్ట్ ఫుడ్ నిర్వాహకులు కనీస జాగ్రత్తలు తీసుకోవడం లేదనే విమర్శలు జోరుగానే వినిపిస్తున్నాయి.



సగం ఉడకబెట్టిన మాంసం పదార్థాలు, పచ్చిమాంసం వంటి వాటిని రోజులు తరబడి ఫ్రిజ్లో భద్రపరిచినవి, కోటింగ్ వేసినవి, రాత్రి పూట వ్యాపారం పూర్తయిన తర్వాత మిగిలినవి కూడా ఫ్రిజ్ లలో నిల్వ ఉంచి ఉదయమే అమ్మేస్తున్నారు. దాదాపుగా అన్ని హెరీటళ్ళలో ఇదే తంతు జరుగుతోంది. అలాగే వంట సమయంలో వినియోగించే వస్తువులు నాసిరకమైనవిగా ఉంటున్నాయి. రుచి, రంగులను వాసనతో ఆహార పదార్థాలు ఉండేలా రసాయనాలను వినియోగిస్తున్నారు. ఆహార పదార్థాల మీద పైపై కోటింగ్ తో ప్రజలను ఆకర్షిస్తూ వారి ఆరోగ్యాలతో చెలగాటమాడుతున్నారు. కనీస నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా ఇష్టారాజ్యంగా వ్యాపారాలు చేస్తూ లక్షలు కూడబెట్టుకుంటున్నారు. దీంతో వ్యాపారులు ప్రజల ఆరోగ్యాన్ని ఫణంగా పెట్టి నిల్వ ఉన్న ఆహారాన్ని, చనిపోయిన కోళ్ళ కుళ్లిపోయిన మాంసాన్ని వండి నిర్భయంగా వడ్డిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆహారభద్రత చట్టం 2006, 2011 ప్రకారం హెరీటళ్ళలో అధికారులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించవచ్చు. అలాగే చట్టంలో పేర్కొన్న సెక్షన్ 51, 52ల నిభందనల ప్రకారం ఆహారం కల్తీ చేసినా, నిల్వ ఆహారం వడ్డించినా, సరైన ప్రమాణాలు పాటించకపోయిన హెరీటల్ యజమానులపై కేసులు నమోదు చేసి, చట్ట ప్రకారం చర్యలు తీసుకోవచ్చు. అధికారులు ఉదాసీన వైఖరి వల్ల ప్రజల జేబుకు చిల్లు పడటమే కాకుండా ప్రజల ఆరోగ్యం నాశనమవుతోంది. ఇప్పటికైనా ప్రజల ఆరోగ్య, ఆహార కల్తీ నియంత్రణ అధికారులు, విజిలెన్స్



అధికారులు, పురపాలక శాఖ అధికారులతో కలిసి మేడ్చల్ పురపాలక సంఘం పరిధిలోని ఫాస్ట్ ఫుడ్ సెంటర్లపై మరిన్నితనిఖీలు నిర్వహించి, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని, మేడ్చల్ పురపాలక సంఘం పరిధిలో కల్తీలకు పాల్పడుతున్న ఫాస్ట్ ఫుడ్ సెంటర్ల నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

### శిక్షణ లేకుండా...:

ఆహార పదార్థాలు తయారు చేసేవారు(కుక్) తప్పనిసరిగా శిక్షణ పొందాలి. కానీ చాలామంది కొద్దిరోజుల పాటు హెూటళ్లలో పనిచేసి కుక్ గా అవతారమెత్తుతున్నారు. కొందరు ఏకంగా ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నారు. ఇటువంటి వారిపై నిఘా పెంచడంతో పాటు ఆహార తయారీపై అవగాహన కల్పించాల్సిన అధికారులు ఆ దిశగా ప్రయత్నాలు చేయడం లేదు.

### చికెన్ నూడిల్స్ తిని ఆస్పత్రి పాలైన జయంతి

మేడ్చల్ పురపాల సంఘం పరిధిలోని కేఎల్ఆర్ వెంచర్ లో గల శివాజీ విగ్రహం సమీపంలో తుమ్మల గాంధీ యాదవ్ ఏర్పాటు చేసిన ఛాయ్ అమృత్ అనే ఫాస్ట్ ఫుడ్ సెంటర్ లో గురువారం సాయంత్రం చికెన్ నూడుల్స్ ఆర్డర్ పై పార్సెల్ జయంతి అనే మహిళ తన ఇంటికి తీసుకెళ్లి చికెన్ నూడుల్స్ తిన్న గంటన్నర అనంతరం జయంతి అనే మహిళ కాళ్లు, చేతులు వాపులు వచ్చాయి. అప్పటికే అర్ధరాత్రి సమయం కావడంతో మరుసటి రోజు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి వెళ్లిన ఆరోగ్య పరిస్థితి మెరుగు కాకపోవడంతో శనివారం ఉదయం మేడ్చల్ పట్టణంలోని ప్రైవేట్ ఆసుపత్రిలో చేరి వైద్య సేవలు అందుకుంటుంది. ఇప్పటికైనా నాణ్యమైన ఆహారం అందించని చాయ్ అమృత్ ఫాస్ట్ ఫుడ్ సెంటర్ తో పాటు మేడ్చల్ పురపాల సంఘం పరిధిలో ఉన్న ఫాస్ట్ ఫుడ్ సెంటర్ లపై చర్యలు తీసుకోవాలని కమిషనర్ బట్టు నాగిరెడ్డిని పురపాల సంఘం ప్రజలు కోరుతున్నారు.



## 'హరిహర వీరమల్లు' బడ్జెట్ రూ.250 కోట్లు

### – దర్శకుడు జ్యోతికృష్ణ

పవర్‌స్టార్ పవన్ కళ్యాణ్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రాలలో హరిహరి వీరమల్లు ఒకటి. పీరియాడిక్ యాక్షన్ చిత్రంగా వస్తున్న ఈ సినిమాకు ఎ.ఎమ్. జ్యోతికృష్ణ, క్రిష్ జాగర్లమూడి దర్శకత్వం వహించారు. ఆస్కార్ విజేత ఎం.ఎం. కీరవాణి సంగీతం అందిస్తుండగా.. ఎ.ఎమ్. రత్నం సమర్పణలో, మెగా సూర్య ప్రొడక్షన్ బ్యానర్‌పై ఎ. దయాకర్ రావు ఈ భారీ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

ఈ మూవీని మొదట జూన్ 12న తీసుకురాబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే వీఎఫ్ఎక్స్ పనులు ఆలస్యం కావడంతో మూవీని తాజాగా వాయిదా వేస్తున్నట్లు చిత్రబృందం శుక్రవారం ప్రకటించింది.

ఇదిలావుంటే తాజాగా ఈ మూవీ బడ్జెట్ గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు దర్శకుడు జ్యోతికృష్ణ.. ప్రమోషన్స్‌లో భాగంగా.. మచిలీపట్నంలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న జ్యోతికృష్ణ.. ఈ సినిమా బడ్జెట్ రూ.250 కోట్లకు పైగా ఉంటుందని వెల్లడించాడు. రెండు భాగాలుగా ఈ సినిమా వస్తుండటంతో భారీ బడ్జెట్‌తో ఈ సినిమాను నిర్మిస్తున్నట్లు జ్యోతికృష్ణ తెలిపాడు. కాగా జ్యోతికృష్ణ చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం వైరల్‌గా మారాయి.

## బన్నీ-అట్లీ.. అప్‌డేట్ రెడీ



గత ఏడాది పుష్ప: ది రూల్ చిత్రంతో భారీ విజయాన్నందుకున్నాడు అల్లు అర్జున్. దీని తర్వాత త్రివిక్రమ్ దర్శకత్వంలో ఓ చారిత్రక నేపథ్యంలో సాగే సినిమా చేయాల్సింది బన్నీ. కానీ అది వెనక్కి వెళ్లి.. దాని స్థానంలోకి అట్లీ చిత్రం వచ్చింది. రొటీన్ మాస్ మసాలా సినిమాలు తీసే అట్లీతో సినిమా ఏంటి అని ముందు బన్నీ ఫ్యాన్స్ ఒకింత అసంతృప్తి వ్యక్తం చేశారు కానీ.. ఈ సినిమా ప్రి విజువలైజేషన్ వీడియో వచ్చాక మాత్రం వారి ఆలోచన మారింది. అట్లీ ఈసారి హాలీవుడ్ స్థాయి సైఫై థ్రిల్లర్ ఏదో ట్రై చేస్తున్నాడని.. ఈ సినిమా లేవెలే వేరుగా ఉండబోతోందని ఆ వీడియో సంకేతాలు ఇచ్చింది. ఈ సినిమా నుంచి ఇప్పుడు తర్వాతి అప్‌డేట్ రెడీ అయింది. శనివారం ఉదయం 11 గంటలకు ఆ అప్‌డేట్‌ను పంచుకోనున్నట్లు నిర్మాణ సంస్థ సన్ పిక్చర్స్ అధికారికంగా ప్రకటించింది. బన్నీ-అట్లీ సినిమా నుంచి రాబోతున్న అప్‌డేట్ హీరోయిన్ గురించే అని సమాచారం. ఇటీవలే సందీప్ రెడ్డి వంగ-ప్రభాస్‌ల చిత్రం స్పిరిట్ నుంచి అనూహ్య పరిస్థితుల్లో వైదొలిగిన దీపికా పదుకొనేను బన్నీకి జోడీగా తీసుకుంటున్నట్లు ఇప్పటికే వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. ఇప్పుడా విషయాన్నే అధికారికంగా ప్రకటించబోతున్నారట. మరి దీపిక ఈ సినిమాలో భాగం కానున్నట్లు జస్ట్ సమాచారం ఇస్తారా.. లేక ఆమె ఫస్ట్ లుక్ కూడా రిలీజ్ చేస్తారా అన్నది చూడాలి. ఈ చిత్రంలో ఇంకో ఇద్దరు స్టార్ హీరోయిన్లకు చోటు ఉంది. అందులో ఒకరు జాన్వి కపూర్ కాగా.. మరొకరు మృణాల్ ఠాకూర్ అని వార్తలు వస్తున్నాయి. ఈ చిత్రంలో బన్నీ త్రిపాత్రాభినయం చేస్తున్నట్లు జోరుగా ప్రచారం సాగుతున్న సంగతి తెలిసిందే. మూడు పాత్రలకు ముగ్గురు హీరోయిన్లు జోడీ అన్నమాట.

## మణిరత్నం తొలిసారి

# ఆ ఫీలింగ్ కలిగించాడు

లెజెండరీ డైరెక్టర్ మణిరత్నం గొప్పదనం గురించి కొత్తగా చెప్పాల్సిన పని లేదు.



38 ఏళ్ల కిందటే 'నాయకన్' లాంటి ఆల్ టైం క్లాసిక్ అందించిన దర్శకుడాయన. ఆ తర్వాత రోజా, బొంబాయి, సఖి, ఇద్దరు, యువ.. ఇలా ఎన్నో ఆణిముత్యాలను అందించిన ఘనుడాయన. ఐతే ఎలాంటి దర్శకుడికైనా ఒక దశ దాటాక పరాజయాలు రావడం సహజం. మణిరత్నం కూడా అందుకు మినహాయింపు కాలేకపోయారు. రావణ్, కడలి, చెలియా లాంటి చిత్రాలు ఆయనకు చేదు అనుభవం మిగిల్చాయి. ఐతే మణిరత్నం ఫ్లాప్ సినిమాలు తీస్తే తీసి ఉండొచ్చు కానీ.. ఆ చిత్రాలు ఏవీ ఆయన ఔట్ డేట్ అయిపోయాడు అనే ఫీలింగ్ మాత్రం కలిగించని మాట వాస్తవం. 'చెలియా' సినిమా పరమ బోరింగ్‌గా అనిపించినా.. దాన్ని ట్రెండీగానే తీశారు మణిరత్నం. ఇదేం ముతక కథ.. ఇవేం రొటీన్ సన్నివేశాలు అనిపించలేదు. ఆ తర్వాత ఆయన్నుంచి వచ్చిన 'పొన్నియన్ సెల్వన్'లో కూడా అలాంటి ఫీలింగ్ కలగలేదు. కానీ ఇన్నేళ్ల కెరీర్లో మణిరత్నం ఔట్ డేట్ అయిపోయాడు అని ఆయన అభిమానులకు ఫస్ట్ టైం ఒక ఫీలింగ్ కలిగించిన సినిమా బహుశా 'థగ్ లైఫ్'యేనేమో. తాను తీసిన ఫ్లాప్ సినిమాలతో కూడా గౌరవం సంపాదించుకున్న దర్శకుడాయన. కొన్ని ఎపిసోడ్లలో అయినా మెరుపులు మెరిపించేవారు. కానీ 'థగ్ లైఫ్' మాత్రం అందుకు మినహాయింపు. ట్రైలర్ చూస్తే భలేగా అనిపించింది కానీ.. సినిమాగా మాత్రం ఇది తీవ్రంగా నిరాశపరిచింది. ఇండియన్ స్క్రీన్ మీద ఎన్నో సార్లు చూసి.. అరిగిపోయిన రొటీన్ గ్యాంగ్ స్టర్ డ్రామా కథను ఎంచుకుని.. దాన్ని అంతే రొటీన్ స్క్రీన్ ప్లేతో నడిపించి తన అభిమానులకు పెద్ద షాకే ఇచ్చాడు మణిరత్నం. ముఖ్యంగా సెకండాఫ్ చూస్తుంటే చాలామందికి 'ఇండియన్-2' గుర్తుకొచ్చింది. ఇంత రొటీన్‌గా, బోరింగ్‌గా సీన్లు ఎలా తీయగలిగారు అని ఆశ్చర్యం కలిగించింది. పూర్తిగా ఔట్ ఆఫ్ ఆర్డర్ అనిపించారు మణిరత్నం. దీంతో ఫ్యాన్స్ సైతం ఇక ఆయన సినిమాలు మానేస్తే మంచిదనే అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్న పరిస్థితి.

## 'బ్యాచిలర్స్ ప్రేమ కథలు'

యస్.యం.4 ఫిలిమ్స్ బ్యానర్ పై గీతా సింగ్, కార్తీక్, కాశీ మదన్, ఇషాని, చలానా అగ్నిహోత్రి, శృతి లయ నటీనటులుగా యం.యన్.వి సాగర్ స్వీయ దర్శకత్వంలో వస్తున్న చిత్రం 'బ్యాచిలర్స్ ప్రేమ కథలు'. ఈ చిత్ర పూజా కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వచ్చిన దర్శకులు వి.సముద్ర కెమెరా స్విచ్చాన్ చేయగా, దర్శకులు వీరశంకర్ క్లాప్ ఇచ్చారు. దర్శక, నిర్మాత సాగర్ మాట్లాడుతూ, 'నేను తీసిన 'కాలం రాసిన కథలు' సినిమాకు ప్రేక్షకుల నుండి మంచి రెస్పాన్స్ వచ్చింది.ఆ ఉత్సాహంతోనే దానికి సీక్వెల్‌గా 'బ్యాచ్‌లర్స్ ప్రేమ కథలు' సినిమా తీస్తున్నాను. ఈ సినిమా ద్వారా ప్రేక్షకులకు మంచి సోషల్ మెసేజ్ ఇవ్వబోతున్నాను. అలాగే ఈ చిత్రంతో నూతన నటీనటులను ఇండస్ట్రీకి పరిచయం చేస్తున్నాను. ఈ నెలలోనే షూటింగ్ స్టార్ట్ చేస్తాం. ఈ ఏడాదిలోనే ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు రంగం సిద్ధం చేస్తున్నాం' అని తెలిపారు. 'అందరూ నా పాత్రకు కామెడీ ఎక్స్పెక్ట్ చేస్తారు. కానీ అందుకు భిన్నంగా ఈ సినిమాలో ఎమోషనల్ పాత్ర చేయ బోతున్నాను. ఈ సినిమా ద్వారా సెకండ్ ఇన్నింగ్స్ స్టార్ట్ చేసే అవకాశం కల్పించిన దర్శక, నిర్మాత సాగర్‌కి థ్యాంక్స్' అని నటి గీతా సింగ్ చెప్పారు. నటుడు కార్తీక్ మాట్లాడుతూ,'యూత్ మెచ్చే మంచి మెసేజ్ ఉన్న ఇలాంటి సినిమా ద్వారా ఇండస్ట్రీకి పరిచయం చేస్తున్న సాగర్‌కి నా ధన్యవాదాలు' అని అన్నారు. ఈ చిత్రానికి డిఓపి : ప్రసాద్ ఎస్, మ్యూజిక్ మెరుగు అరమాన్, ఎడిటర్ : నందమూరి హరి.



## ఏంటి ప్రభాస్ మరో సినిమాకి కూడా

# దీపిక హ్యాండ్ ఇచ్చిందా..!



బాలీవుడ్ అందాల ముద్దుగుమ్మ దీపికా పదుకొణే ఈ మధ్య వివాదాలతో వార్తలలో నిలుస్తుండడం మనం చూస్తూ ఉన్నాం. ప్రభాస్, సందీప్ రెడ్డి వంగా కాంబోలో రూపొందనున్న స్పిరిట్ మూవీలో దీపికాని హీరోయిన్‌గా అనుకున్నాడు సందీప్. కథ కూడా చెప్పాడట. కాని కండీషన్స్‌కి చిర్రెత్తుకొచ్చిన సందీప్ రెడ్డి వంగా కథానాయికగా యానిమల్ భామ తృప్తి దిమ్రిని ఫైనల్ చేసాడు. అందుకు సంబంధించి అఫీషియల్ ప్రకటన కూడా వచ్చింది. అయితే తన ప్రాజెక్ట్ నుండి దీపికాని తప్పించడంతో కథ అంతా లీక్ చేసిందని దీపికాపై ఆగ్రహం వ్యక్తం చేసాడు సందీప్ రెడ్డి వంగా. ఇక దీపిక కూడా తగ్గేదే లే అన్నట్టు తనదైన శైలిలో కౌంటర్ ఇచ్చింది.ఇక స్పిరిట్ నుండి తప్పుకున్న దీపికా పదుకొణే .. అట్లీ దర్శకత్వంలో అల్లు అర్జున్ హీరోగా రూపొందనున్న సినిమాకి సైన్ చేసిందనే టాక్ నడిచింది. దీనిపై క్లారిటీ అయితే లేదు. ఇక దీపిక ప్రభాస్- నాగ్ అశ్విన్ కాంబోలో రూపొందిన కల్కి చిత్రంలో నటించి తెలుగు ప్రేక్షకుల మనసులు గెలుచుకుంది. ఇక కల్కి 2లో కూడా దీపికా నటించాల్సి ఉండగా, ఈ ప్రాజెక్ట్ నుండి ఆమె తప్పుకుందని జోరుగా ప్రచారం సాగుతుంది. తల్లి అయిన తర్వాత ఆమె తక్కువ పని గంటలు పని చేస్తానని డిమాండ్ చేయడం.. 8 గంటల వర్క్, ఎక్స్ ట్రా షూటింగ్ చేస్తే ఎక్స్ ట్రా పేమెంట్ అంటూ కొన్ని కండీషన్స్ పెట్టడంతో నిర్మాతలు ఆలోచనలో పడ్డారట.ఈ క్రమంలో కల్కి 2 నుండి కూడా దీపికని తప్పించారనే వార్తలు బీటౌన్ మీడియాలో హల్‌చల్ చేస్తున్నాయి. అయితే ఈ వార్తల్లో నిజం లేదని దీపికా పీఆర్ టీమ్ నుంచి ఓ క్లారిటీ వచ్చింది.

కల్కి 2 కు సంబంధించి ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ వర్క్ జోరుగా సాగుతుంది. పైగా దీపికా పాత్ర సెకండ్ పార్ట్ లో చాలా కీలకం కాగా, తనను తప్పించి వేరే వారిని తీసుకునే ఆలోచన కల్కి టీమ్ అయితే చేయకపోవచ్చు. అలాగే తప్పుకోవాలన్న ఆలోచనా దీపికాకు లేదు. సో.. దీపికా పదుకోణే కల్కి 2 నుంచి తప్పుకుంది అనే వార్తలు ఇప్పటికైతే పూర్తిగా నిరాధారం అని చెప్పాలి.

## త్రిషను ఇలా చూపకండి ప్లీజ్



తాజాగా విడుదలైన థగ్ లైఫ్ లో త్రిష పాత్రను చూశాక అభిమానుల నుంచి ముక్తకంఠంతో వినిపిస్తున్న కోరిక ఇదొక్కటే. విడుదలకు ముందు ట్రైలర్ చూశాక తను కమల్ హాసన్ తో రొమాన్స్ చేయడం గురించి సోషల్ మీడియాలో రకరకాల కామెంట్స్, మీమ్స్ వచ్చాయి. ఇదే విషయం తనను ఇంటర్వ్యూలో అడిగితే తెరమీద చూడండి, థ్రిల్ అయ్యే ట్విస్టు ఉంటుందని చెప్పింది. తీరా చూస్తే ఇటు కమల్ అటు శింబు ఇద్దరితో రొమాన్స్ పెట్టిన దర్శకుడు మణిరత్నం అసలేం చెప్పాలనుకున్నాడో ఎంత బుర్రలు బద్దలు కొట్టుకున్నా అర్థం కాలేదు. పైగా త్రిష క్యారెక్టర్ కిచ్చిన ఎండింగ్ చూశాక నోటమాట రావడం కష్టమే. సెకండ్ సెటప్, వేశ్యగా స్టార్ హీరోయిన్లను చూపించడం కొత్త కాదు. ఆ మాటకొస్తే వేదంలో అనుష్క ఎంత అద్భుతంగా పెర్ఫార్మ్ చేసిందో ఎవరూ మర్చిపోలేం. కానీ థగ్ లైఫ్ లో త్రిషకు అంత స్కోప్ దొరకలేదు. అసలు మణిరత్నం టేస్ట్ ఇంతగా పడిపోయిందా అని చెప్పేందుకు ఒక చిన్న ఉదాహరణ చెప్పాలి. జైలు నుంచి బయటికి వచ్చిన కమల్ హాసన్ మూడు రోజులు త్రిష ఇంట్లోనే గడుపుతాడు. వాళ్ళ బంధం గురించి బయట వృద్ధురాలైన వడవుక్కరసి వర్ణించడం వింటే బి గ్రేడ్ కంటే అన్యాయంగా ఉంటాయి. అసలీ పాత్ర లేకపోయినా కథకు ఎలాంటి ఇబ్బంది లేదు అనేలా త్రిషని చూపించడం ట్రాజెడీ. సరే తమిళంలో ఎలా చూపించినా ఓకే కానీ త్రిష నుంచి నెక్స్ట్ రాబోయే సినిమా విశ్వంభర. చిరంజీవి హీరో అందులోనూ ఫాంటసీ మూవీ కనక తగినంత ప్రాధాన్యం దక్కి ఉంటుందని ఫ్యాన్స్ భావిస్తున్నారు. ఇప్పటికే గుడ్ బ్యాడ్ అగ్లీతో ఓ మోస్తరు హిట్ థగ్ లైఫ్ తో అల్ట్రా డిజాస్టర్ అందుకున్న త్రిషకు మెగా మూవీ ఎలాంటి బ్రేక్ ఇస్తుందో చూడాలి. దీంతో పాటు మోహన్ లాల్ తో కలిసి నటించిన రామ్ కూడా లైన్ లో ఉంది. కాకపోతే షూట్ ఇంకా బాలన్స్ ఉంది. పొన్నియిన్ సెల్వన్ లో ఎంతో అందంగా చూపించిన మణిరత్నమే ఇప్పుడీ థగ్ లైఫ్ ఇంత చెత్తగా చూపించడాన్ని సగటు ప్రేక్షకులు సైతం జీర్ణించుకోలేకపోతున్నారు.

# ఇక భారమంతా నీదేరా



జూన్ నెల వారానికో ప్యాన్ ఇండియా సినిమాతో కళకళలాడుతుందనుకుంటే దానికి భిన్నంగా థగ్ లైఫ్ బోణీ డిజాస్టర్ కావడం, జూన్ 12 రావాల్సిన హరిహర వీరమల్లు వాయిదా పడటం ఇండస్ట్రీ వర్గాలకు షాకిచ్చాయి. ఇక నుంచి థియేటర్లు జనంతో నిండిపోతాయనుకుంటే దానికి భిన్నంగా ఇంకో రెండు వారాలు మూసేస్తే నయమనే భావనలో ఎగ్జిబిటర్లు ఉన్నారు. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే పర్సెంటేజ్ లు, రెంట్లు తర్వాత అసలు ఈ వ్యాపారమే వద్దనుకుంటున్న వాళ్ళ లిస్టు పెరిగేలా ఉంది. ఈ నేపథ్యంలో జూన్ 20 వైపు అందరి దృష్టి వెళ్తోంది. కుబేర విడుదల కాబోతున్న నేపథ్యంలో భారమంతా దాని మీదే ఉంది.నా సామిరంగ తర్వాత నాగార్జున తెరమీద కనిపించనున్న సినిమా ఇదే. ఏడాదిన్నర పైగా గ్యాప్ రావడంతో అక్కినేని ఫ్యాన్స్ ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ధనుష్ మెయిన్ హీరో అయినప్పటికీ ప్రాధాన్యత పరంగా ఇద్దరినీ బాలన్స్ చేసి ఉంటారనే నమ్మకం ట్రైలర్ తో వచ్చింది. అందులోనూ కథను నిజాయితీగా చూపించే శేఖర్ కమ్ముల దర్శకుడు కాబట్టి అది మరింత ఎక్కువగా ఉంది. రష్మిక మందన్న, దేవిశ్రీ ప్రసాద్ సంగీతం, డబ్బు క్రైమ్ తో ముడిపడిన విభిన్నమైన నేపథ్యం, తదితరాలు ఆసక్తిని పెంచుతున్నాయి. అందులోనూ రాజీ లేకుండా ఎక్కువ కాలం నిర్మాణం జరుపుకున్న చిత్రమిది. ఇప్పుడు టాలీవుడ్ బాక్సాఫీస్ కు ఊపిరి ఊదాల్సిన బాధ్యత కుబేర మీద ఉంది. ఒక బిచ్చగాడు కోటీశ్వరుడు అయ్యే క్రమంలో ఎదురయ్యే సామజిక రాజకీయ పరిస్థితుల ఆధారంగా శేఖర్ కమ్ముల దీన్ని తెరకెక్కించారు. పాటలు వేటికవే వైవిధ్యంగా అనిపిస్తున్నాయి. కంటెంట్ కనక క్లిక్ అయితే కుబేరకు వసూళ్ల వర్షం ఖాయం.

# వేములవాడలో ప్రైవేట్ పాఠశాలల దోపిడీ..! విద్యా శాఖ మౌనం...!!

- పుస్తకాల పేరుతో వేలాది రూపాయలు వసూలు
- తల్లిదండ్రుల్లో నెలకొన్న ఆందోళన
- బీఆర్ఎస్ పార్టీ విద్యార్థి విభాగం నాయకులు : పోతు అనిల్ హెచ్చరిక



వేములవాడ, (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా,వేములవాడ పట్టణంలో ప్రైవేట్ పాఠశాలల దోపిడీ రోజురోజుకూ పెరిగిపోతోందని బీఆర్ఎస్ పార్టీ విద్యార్థి విభాగం (బీఆర్ఎస్వీ) వేములవాడ నియోజకవర్గం నాయకులు పోతు అనిల్ కుమార్ ఆరోపించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుస్తకాల పేరుతో రూ.5 వేల నుండి రూ.12 వేల వరకు, ఫీజుల పేరుతో మరింత అధిక మొత్తంలో ఫీజులు వసూలు చేస్తున్నాయని, విద్యాశాఖ మాత్రం ఈ దోపిడీపై కనీసం స్పందించకపోవడం బాధాకరమన్నారు.

**- పుస్తకాల అమ్మకాలపై విచారణ జరపాలి**

ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడిన అనిల్, "ప్రైవేట్ పాఠశాలలు పుస్తకాల విక్రయాలపై కూడా నియంత్రణ లేకుండా పని చేస్తున్నాయి. బుక్ సెల్లర్లతో కుమ్మక్కై విద్యార్థుల తల్లిదండ్రులపై భారం మోపుతున్నారు. అమ్మకాల పన్నుల శాఖ (సేల్స్ టాక్స్ డిపార్ట్‌మెంట్) అధికారులు వెంటనే బుక్ షాపులపై తనిఖీలు నిర్వహించాలని, నిబంధనలకు విరుద్ధంగా విక్రయాలు సాగుతున్నాయి" అని తెలిపారు.

**- పర్మిషన్ లేని పాఠశాలల్లో అడ్మిషన్లు**

"వేములవాడ పట్టణంలో అనుమతులు లేకుండానే పాఠశాలలు ప్రారంభమయ్యాయి. పర్మిషన్, మౌలిక సదుపాయాలు లేకుండా పెద్దఎత్తున అడ్మిషన్లు తీసుకుంటూ తల్లిదండ్రుల నుండి అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నాయి. విద్యా హక్కు చట్టం ప్రకారం విద్య అందించేలా చర్యలు తీసుకోవాలి," అని పోతు అనిల్ డిమాండ్ చేశారు.

**- విద్యాశాఖ నిద్రమత్తు వీడాలి**

"విద్యాశాఖ అధికారులు ఇప్పటికీ నిద్రలోనే ఉన్నారు. కలెక్టర్ వెంటనే రంగంలోకి దిగాలి.అన్ని ప్రైవేట్ పాఠశాలలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలి. మౌలిక సదుపాయాలు లేని పాఠశాలలు మూసివేయాలి. నిబంధనలు పాటించని పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలి," అని కోరారు.

**- తల్లిదండ్రులకు సూచనలు**

"తల్లిదండ్రులు జాగ్రత్తగా ఉండాలి. మీరు చెల్లించే ప్రతి రూపాయికి బిల్లులు,వివరాలు అడగాలి. అనవసర ఖర్చులను వ్యతిరేకంగా నిలదీయాలి. నిబంధనలకు విరుద్ధంగా డబ్బులు వసూలు చేస్తే అధికారులకు ఫిర్యాదు చేయాలి," అని అనిల్ సూచించారు.

**- బీఆర్ఎస్వీ తరఫున ఆందోళనలు**

చివరగా పోతు అనిల్ హెచ్చరిస్తూ, "సత్వరమే ప్రభుత్వ శాఖలు స్పందించకపోతే బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ధర్నాలు, నిరసన కార్యక్రమాలు చేపడతాం. విద్యార్థుల హక్కులను రక్షించేందుకు ప్రతి స్థాయిలో పోరాటం చేస్తాం," అని పోతు అనిల్ స్పష్టం చేశారు.

## ప్రైవేటు బడులు వద్దు ప్రభుత్వ బడులే ముద్దు

**గిరిజన గ్రామంలో బడిబాట**



భద్రాద్రి బ్యూరో (ప్రశ్న న్యూస్) సర్కారు బడులలోనే విద్యార్థుల భవిష్యత్తు పెంపొందిస్తుందని నాణ్యమైన విద్య బోధన ద్వారానే వారి భవిష్యత్తుకు బంగారు బాట వేస్తుందని ప్రైవేటు బడులు వద్దని ప్రభుత్వ బడులే ముద్దు అని శనివారం బూర్గంపహాడ్ మండలంలోని గిరిజన ఆశ్రమ పాఠశాల (బాలురు) ఆధ్వర్యంలో ఉప్పుసాక గ్రామపంచాయతీ పరిధిలోని రాజీవ్ నగర్ వలస గోత్తికోయ ఆదివాసీ గ్రామంలో విద్యపై అవగాహన కల్పించే బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు రూప్లా, హరిలాల్, సీతారాం గ్రామస్తులకు విద్య యొక్క ప్రాముఖ్యతను వివరించారు. ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలల ద్వారా విద్యార్థులకు అందుతున్న ఉచిత నేస్తం నిలయం, వసతి, భోజనం, యూనిఫాంలు, బూట్లు, షూస్, నోట్ బుక్స్ఇతర సౌకర్యాల గురించి తెలియజేశారు. గ్రామస్థులు, పిల్లలు పెద్ద సంఖ్యలో పాల్గొని విద్యపై ఆసక్తి చూపారు. వలస గ్రామాలలో విద్యలో భాగస్వామ్యాన్ని పెంపొందించే ఈ కార్యక్రమం మంచి ఆదరణ పొందిందనీ వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయులు గ్రామస్తులు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## రాజన్న సేవలో సిద్దార్థ్ ఎస్ జే (డిఓపి)

**- ప్రియాంక వర్మ భూపతి రాజు దంపతులు**



వేములవాడ,(ప్రశ్న న్యూస్) దక్షిణ కాశీగా ప్రసిద్ధిగాంచిన వేములవాడ శ్రీపార్వతి రాజరాజేశ్వరస్వామివారిని శనివారం నాంది,ఉగ్రం సినిమాల డిఓపి (డైరెక్షన్ ఆఫ్ ఫోటోగ్రఫీ) సిద్ధార్థ్ ఎస్ జే – ప్రియాంక వర్మ–భూపతి రాజు దంపతులు కుటుంబ సమేతంగా దర్శించుకుని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి దర్శనం అనంతరం స్వామి వారికి ఇష్టమైన కోడె మొక్కులు చెల్లించుకొని సేవలో తరించారు. అర్చకులు మామిడిపెల్లి శరత్ కుమార్ నాగిరెడ్డి మండపంలో వేదోక్త ఆశీర్వచనంతో పాటు స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా దంపతులు మాట్లాడుతూ స్వామి వారి దర్శించుకోవడం చాలా ఆనందంగా ఉందని,స్వామివారి కరుణ కటాక్షాలు అందరిపై ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. మరిన్ని కొత్త ప్రాజెక్ట్స్ తో మీ ముందుకు వస్తున్నట్లు వెల్లడించారు.

## కేసుల పరిష్కారానికి ప్రోత్సహిస్తున్న రుద్రంగి పోలీసులు

- జాతీయ లోక్ అదాలత్ అవగాహన కోసం రుద్రంగి పోలీసుల చైతన్య యాత్ర
- జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి
- రుద్రంగి సబ్ ఇన్స్పెక్టర్ : మోతీరాం



రుద్రంగి, (ప్రశ్న న్యూస్) వేములవాడ నియోజకవర్గం, రుద్రంగి మండల పోలీస్ స్టేషన్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న కేసులను రాజీ ద్వారా పరిష్కరించేందుకు ప్రజలకు అవగాహన కల్పిస్తూ రుద్రంగి సబ్ ఇన్స్పెక్టర్ మోతీరాం నేతృత్వంలో పోలీసులు చైతన్య యాత్ర చేపట్టారు. ఈ నెల 9వ తేదీ నుండి 14వ తేదీ వరకు నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను పురస్కరించుకొని ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నారు.ఈ క్రమంలో ఎస్సై మోతిరామ్ నేతృత్వంలో పోలీసులు మానాల సహా పరిసర గ్రామాలను సందర్శించారు. వివిధ కేసుల పక్షాలతో ముఖాముఖి చర్చలు జరిపి, సమస్యలను శాంతియుతంగా పరిష్కరించుకునేలా అవగాహన కల్పించారు. "రాజీ మార్గమే రాజ మార్గం" అనే నినాదంతో ప్రజల్లో చైతన్యం సృష్టించారు. గ్రామాల్లో వ్యక్తిగతంగా హాజరై, పిర్యాదుదారులు, ప్రత్యర్థుల మధ్య పరస్పర అంగీకారంతో రాజీలకు సహకరించేలా ప్రజల్లో న్యాయవ్యవస్థపై నమ్మకాన్ని పెంపొందించడమే లక్ష్యంగా పోలీసులు పని చేస్తున్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ మోతిరామ్ మాట్లాడుతూ, "జాతీయ లోక్ అదాలత్ అనేది ప్రజలకు న్యాయ సేవలను మరింత చేరువ చేసే గొప్ప వేదిక. రాజీ ద్వారా పరిష్కారం సాధించడంవల్ల సమాజంలో శాంతి, సౌహార్ద వాతావరణం ఏర్పడుతుంది," అని పేర్కొన్నారు.

## రాష్ట్ర స్థాయిలో ప్రశంసలందుకున్న ఎస్సై అంజయ్యకు ఘన సన్మానం

- బాధితులకు సత్వర న్యాయం...శాంతిభద్రతల పరిరక్షణకు అంజయ్య చేస్తున్న కృషి అభినందనీయం
- కాంగ్రెస్ పార్టీ నేతలు



వేములవాడ, (ప్రశ్న న్యూస్) చందుర్తి పోలీస్ ఠాణాలో సబ్ ఇన్స్పెక్టర్ గా విధులు నిర్వహించి,బాధితులకు సత్వర న్యాయం అందించడంలో,శాంతి భద్రతల పరిరక్షణలో ఉత్తమ సేవలు అందించి, తెలంగాణ రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొంది, రాష్ట్ర డీజీపీ చేతులమీదుగా ప్రశంసాపత్రం అందుకున్న అంజయ్య సాధారణ బదిలీలలో భాగంగా ఇటీవల వేములవాడ రూరల్ సబ్ ఇన్స్పెక్టర్ గా బాధ్యతలు స్వీకరించిన ఎస్సై బి. అంజయ్యకు శనివారం కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. చందుర్తి మాజీ జెడ్పిటిసి సభ్యులు నాగం కుమార్, రుద్రంగి మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఇందూరి మధు ఆధ్వర్యంలో ఆయనను శాలువాతో సత్కరించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఇదే స్ఫూర్తితో వేములవాడ రూరల్ మండలం లోని ప్రజలకు ఉత్తమ సేవలందిస్తారని ఆకాంక్షించి, అభినందించారు.వారి వెంట కాంగ్రెస్ నాయకులు అరుణ్ తేజ చారి తదితరులు ఉన్నారు.

## అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ముదిరాజ్ విద్యార్థులకు ఘన సన్మానం

- తల్లిదండ్రుల కోరిక నెరవేర్చి అత్యున్నత శిఖరాలను అధిరోహించాలి



సిరిసిల్ల( ప్రశ్న న్యూస్) జిల్లాలో పదవ తరగతి, ఇంటర్మీడియట్ లో అత్యుత్తమ ఫలితాలు సాధించిన ముదిరాజ్ విద్యార్థులకు జిల్లా ముదిరాజ్ సేవా సమితి బీసీ స్టడీ సర్కిల్ జెల్ల వెంకటస్వామి ఆధ్వర్యంలో వేములవాడ మండలం అగ్రహారం లోని ఓ ఫంక్షన్ హాల్ లో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముందుగా మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం విద్యార్థులను సత్కరించి మెమొంటో తో పాటు ప్రశంసా పత్రాలను అందజేశారు . ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఇదే స్ఫూర్తి తో కష్టపడి చదివి ఉన్నత స్థాయిలో ఉండాలని, కన్న తల్లిదండ్రుల కోరిక నెరవేర్చి అత్యున్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాక్షించారు. కార్యక్రమంలో కర్ణల భద్రాచలం, పర్ష హన్మాండ్లు, చొక్కల రాము ముదిరాజ్, చొప్పరీ రామచంద్రం, సరుగు నరేష్ ముదిరాజ్, పంబాల దేవరాజు, తూనికి నరేష్, కీసరి శ్రీనివాస్, తునికీ నర్సయ్య , సుతారి మల్లయ్య, మామిండ్ల దశరథం, శత్రబోయిన లక్మణ్, వంకాయల కార్తీక్ ముదిరాజ్, చాడ శ్రీనివాస్ ముదిరాజ్, పిట్ల బాబు ముదిరాజ్, భూపతి, యాదగిరి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఈద్ ముబారక్ ముస్లిం సోదరకు ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి



శ్రీకాళహస్తి(ప్రశ్న న్యూస్) హజ్రత్ ఇబ్రహీం త్యాగనిరతికి ప్రతీకగా నిర్వహించుకునే బక్రీద్ పండుగ సందర్భంగా ముస్లిం సోదర సోదరీమణులకు ఈద్ ముబారక్ తెలిపిన ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి ముందుగా ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి ముస్లిం సోదరుల సంప్రదాయ ప్రకారం హిందీలో మాట్లాడుతుంటే మైనారిటీ సోదరులు ఆనంద వ్యక్తం చేశారు శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ముస్లిం సోదరులకు బక్రీద్ పండుగ సందర్భంగా ఈదులగుంట ఈద్గాకు ముస్లిం మత పెద్దలు ఆహ్వానం మేరకు విచ్చేసి మైనారిటీ సోదరులతో కలిసి బక్రీద్ నమాజ్ చేసి అనంతరం ముస్లిం మత పెద్దలు ముస్లింలు సంప్రదాయ ప్రకారం ఘనంగా సన్మానించారు అలాగే దువా ను స్వీకరించి ముస్లిం సోదరులకు అందరికీ ఈద్ ముబారక్ తెలుపుతూ ప్రతి ముస్లిం సోదరులు కలిసి బక్రీద్ శుభాకాంక్షలు తెలియజేసారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్యాగ నిరతికి బక్రీద్ పండుగ నిదర్శనమని అన్నారు. ధనిక పేద అన్న తారతమ్యం లేకుండా రాగద్వేషాలకు అతీతంగా మైనారిటీలందరూ భక్తిశ్రద్ధలతో ఈ పండుగను జరుపుకుంటున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ దాన గుణం సేవాగుణం అలవర్చుకోవాలని చెప్పారు బక్రీద్ విశిష్టతలో భాగమైన ఖుర్బానీ ని చుట్టుపక్కల వారికి దానంగా అందజేశారు.ఎమ్మెల్యే మాట్లాడుతూ శ్రీకాళహస్తి ముస్లిం సోదరుల కొరకు ఏ చిన్న సమస్య వచ్చినా మీ వెన్నంటే ఉంటానని నాన్న బొజ్జల గోపాలకృష్ణారెడ్డి ఏ విధంగా మీకు సహాయ సహకారాలు అందించారో అదేవిధంగా నేను గెలిచిన మూడు నెలల్లోనే మీరు అడిగిన విధంగా ఈద్గా నమాజ్ వాల్ నమాజు చదువుకునే విధంగా కింద ప్లాట్ఫారం జంగిల్ క్లియరెన్స్ షాది మహల్ మరమ్మత్తులు పెయింటింగ్స్ అన్ని పనులు చేశాను ఇంకా మీకు ఏమి కావాలన్నా ముస్లింల అభివృద్ధి కొరకు నేను పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని. మసీదులు మదర్సాలు అభివృద్ధి కొరకు ప్రభుత్వంతో చర్చించి మీకు సహాయ సహకారాలు అందిస్తానని బక్రీద్ దువా లో తెలిపారు ముస్లిం సోదరులకు ముస్లిం సాంప్రదాయ ప్రకారం ఆలింగనం చేసుకుని ఈద్ ముబారక్ తెలిపారు ఈ కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు బి ఎస్ అక్రమ్ ముక్తిన యామ్ గవర్నమెంట్ ఖాజీ మున్నాభాయ్ నూరుల్లా అంజద్ భాష రెహనా నాయకులు ముని రాజా నాయుడు రాష్ట్ర మైనార్టీ కార్య నిర్వాహ కార్యదర్శి షాకీర్ అలీ జిలాని భాష ఖాదర్ బాషా షఫీ మస్తాన్ అస్మత్ బషీర్ అబ్దుల్ కరీం సి ఎస్ మస్తాన్ మీర్జా షఫీ బాయ్ షాజిద్ ఖాదర్ వల్లి కరీం మీర్జా భాయ్ ముజీబ్ మిర్జా ఆరిఫ్ తదితర మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

## జులై 7 న జరిగే ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవన్ని ఘనంగా నిర్వహించండి

- జిల్లాలోని ప్రతి గ్రామంలో కమిటీల నిర్మాణం చేపట్టాలి
- తిప్పారపు లక్ష్మణ్ మాదిగ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఇంచార్జ్



నాచారం (ప్రశ్న న్యూస్) జిల్లా కేంద్రంలోని నాచారం బహుజన సాహిత్య అకాడమీ కార్యాలయం శనివారం రోజు ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల జిల్లా అత్యవసర సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశనికి జిల్లా అధ్యక్షులు పంగ ప్రణయ్ మాదిగ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా తిప్పారపు లక్ష్మణ్ మాదిగ జిల్లా ఇంచార్జ్ గారు పాల్గొని మాట్లాడుతూ జులై 7 న జరిగే ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం నాగర్ కర్నూల్ జిల్లాలోని ప్రతి గ్రామంలో నిర్వహించాలని, అదే విధంగా ప్రతి గ్రామములో గ్రామ కమిటీ వేయాలని పిలుపునిచ్చారు. పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ తన జీవితాన్ని మాదిగ సమాజం కోసం అంకితం చేసాడని,ప్రతి సంక్షేమ పథకం లో మంద కృష్ణ మాదిగ పోరాటం ఉందని వారు అన్నారు.మాదిగ జాతి కోసం పోరాడుతూనే సమాజంలో సబ్బండ వర్గాల శ్రేయస్సు కోసం పాటు పడిన వ్యక్తికి పద్మశ్రీ రావడం ఎంతో సంతోషాదయకమని,ఆ పద్మశ్రీ పేద వర్గాలకు వచ్చిందని వారు అన్నారు. జాతి కోసం చేసిన పోరాటాన్ని గ్రామాలలో తెలియజేయాల్సిన బాధ్యత మన అందరి పైన ఉందని,దాంట్లో భాగంగా ఎల్ఈడి స్క్రీన్ లు ఏర్పాటు చేసి ఉద్యమ ప్రస్థానాన్ని చూపించాలని అన్నారు.అదే విధంగా ఉద్యమనికి అండగా ఉన్న ప్రతి ఒక్కరికి కృతజ్ఞత తెలియజేయాలని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ కళామండలి అధ్యక్షులు ఎన్ వై అశోక్ మాదిగ , జాతీయ నాయకులూ కేశాపగా రాంచందర్ మాదిగ, కో ఇంచార్జ్ ముంద్రాతి అరుణ్ మాదిగ, సీనియర్ నాయకులూ కోరిపాక అంజి మాదిగ, కేశవ్ మాదిగ, మహిళా అధ్యక్షురాలు సలోమి ,సగ్గు శివ, బచ్చులికూర స్వామి , శ్రీనివాస్ అన్ని మండలలా నుండి నాయకులు పాల్గొన్నారు

## పెద్దమ్మ గుడి రెండు ఎకరాల భూమి కబ్జా

- ఆక్రమించుకుంటున్న నరసయ్యపై తగు చర్యలు తీసుకోవాలని ముదిరాజుల డిమాండ్



ధర్పల్లి (ప్రశ్న న్యూస్) నిజామాబాద్ జిల్లా ధర్పల్లి మండల్ రేకులపల్లి గ్రామశివారు లో గల పెద్దమ్మ ఆలయం కు సంబంధించిన రెండు ఎకరాల భూమిని అదే గ్రామానికి చెందిన నరసయ్య ఆక్రమించుకుంటూ పెద్ద వృక్షాలను హరితహారం కింద పెంపకం చేసినా గ్రామానికి సంబంధించిన



మొక్కలను తొలగించి కబ్జా చేస్తున్నారు. ప్రశ్నించిన ముదిరాజ్ బిడ్డల మీద పైకి దౌర్జన్యం చేస్తూ ఎక్కడ చెప్పుకుంటారో చెప్పండి అని హెచ్చరికలు జారీ చేస్తున్న ఆయనను చూసి భయపడుతూ అందరూ ఒకటిగా వచ్చి పెద్దమ్మ గుడి దగ్గర నిలదీద్దామని ఒక మీటింగ్ ఏర్పాటు చేసుకొని గుడికి సంబంధించిన భూమీ ముదిరాజ్ బిడ్డలకి ఇవ్వాలంటూ ఆగ్రహం వ్యక్తం చేసిన ముదిరాజ్ ముద్దుబిడ్డలు. ఈ కార్యక్రమంలో రేకులపల్లి ముదిరాజ్ సంఘం అధ్యక్షులు జుంగాల భూమయ్య, యన్ సురేష్, ఏ గంగాధర్, సంఘం సభ్యులు ఏ శ్రీనివాస్, బి నర్సయ్య, ఏ గణేష్, ఎస్ వినయ్, ఎస్ రెడ్డి, ఎస్ ప్రభాకర్, ఎస్ భూమయ్య, తదితరులు పాల్గొన్నారు.

# కంటోన్మెంట్లో హైడ్రా

# దీన్ని ఎం అ"నాలా"

- సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు పరిధిలో నాలాలు కబ్జా కోరల్లో కురుకుపోయాయి
- బోర్డు సిఇవో ,హైడ్రా కమీషనర్తో కబ్జా దారులకు హైరానా తప్పదా
- ఆరో వార్డులో అన్యాక్రాంతం అయిన నాలాలు, ఇక ఎవ్వరినీ వదల నంటుంది హైడ్రా
- నాలా భూ బకాసురుల నడ్డి విరుస్తానంటున్న, నహీ చోడింగే చోర్ వాలేకు





**కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ రాష్ట్రంలో మారు మోగుతున్న డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ ప్రొటెక్షన్ ఏజెన్సీ.హైద్రాబాదులో విపత్తు నిర్వహణ,ప్రభుత్వ ఆస్తుల రక్షణ కోసం 2024 లో ఏర్పాటు చేసిన ప్రభుత్వం. అలాగే సర్కార్ ఉత్తర్వుల మేరకు జీవో “99”తో పురుడు పోసుకుంది.అదిగాక హైడ్రా ముఖ్య ఉద్దేశం జంటనగరాల్లో ఉన్న చెరువులు,పార్కులు, లే-అవుట్లోని ఖాళీ స్థలాలు, క్రీడా మైదానాలు,నాలాలు, రహదారులు, రోడ్డుకి ఇరువైపులా ఉండే ఫుట్ పాత్లు పరిరక్షణ చేయడమే దాని లక్ష్యం.అలాగే జాతీయ విపత్తుల నిర్వహణ చట్టానికి అనుగుణంగా ఏర్పాటు అయిన హైడ్రా,దాని విధి విధానాలపై ప్రభుత్వ ఆదేశానుసారం నడుచుకోవాలి.ఇదంతా బాగుంది తెలంగాణ రాష్ట్రంలో అంతర్భాగంగా ఉన్న సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు.అప్పట్లో బోర్డు పరిధిలో హైడ్రా తలదూర్చదన పుకార్లు షికార్లు కొట్టిన విషయం అందరికి తెలిసిందే!కానీ అంచెలంచెలుగా రాష్ట్రంలో ఉన్న అన్ని ప్రధాన నగరాలకు విస్తరించింది.హైడ్రా ఏర్పడి సంవత్సరం గడిచిందో లేదో బోర్డు పరిధిలో ఉన్న మూడో వార్డులో పైగా,హుమాయిన్ నగర్ లో నివాసం ఉంటున్న ప్రజలు ప్యాట్నీ నాలా కబ్జాకు గురైనట్లు ఫిర్యాదుచేయడంతో ఆగమేఘాల మీద కమీషనర్ రంగనాథన్ తో పాటు సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు సిఇవో మధుకర్ నాయక్ జిహెచ్ఎంసి ఉత్తర మండల జోనల్ కమీషనర్ రవికిరణ్, సికింద్రాబాద్ ఆర్డీవో సాయికుమార్ నాలాను పరివేక్షించారు.నలభై గంటల్లో అక్రమాలను తొలగించేసిన హైడ్రా యంత్రాంగం.దీంతో బోర్డు పరిధిలో నివసిస్తున్న ప్రజలు హైడ్రా కమీషనర్ రంగనాథన్ ను సిఇవో మధుకర్ నాయక్ ని ప్రత్యేకంగా అభినందించారు. ఇదే జోరుతో కంటోన్మెంట్లో ఉన్న అక్రమాలను తొలగిస్తూ ముందుకు సాగాలని కోరుకుంటున్న నెటిజన్లు.

### సిఇవో సార్ దీన్ని ఎం అ"నాలా "

సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు పరిధిలో ఉన్న ఆరో వార్డులో ఇద్దరు వ్యాపార సముదాయాలు నిర్వహిస్తున్న మేదావులు నిర్వాకం చూస్తే యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాల్సిందేనని మీరే అంటారని స్థానికులు అంటున్నారు.హస్మత్ పేట రహదారి పై బోర్డు అనుమతులు తీసుకొని నిర్మాణం చేపడతున్న సమయంలో “నాలా”అడ్డుగా ఉందని,కంటోన్మెంట్ అధికారులు నాలా చుట్టూ ఏర్పాటు చేసిన కంచెను సైతం తొలగించి తన పనిని సాఫీగా చేసుకుని రెండు సంవత్సరాల క్రితం వచ్చిన వరదలకు “రాయల్ కాలనీ, ఎస్బిఐ కాలనీ పార్క్ వ్యూ కాలనీ ఆరవెల్లీ కాలనీ మధుపాలా, బిహెచ్ఈఎల్ కాలనీలు నీట మునగడానికి కారణం అయ్యారు.దీనికి తోడు మరో నాలా కబ్జా వెలుగులోకి వచ్చింది.ఎన్ఐఎంహెచ్ లోనేచురల్ స్లోబ్ ద్వారా వర్షం నీరు ముందుకు పోతుంది గత నాలుగు దశాబ్దాలుగా.అయితే ఓం ప్రైవేటు స్కూల్ యాజమాన్యం ఏకంగా ప్రవహిస్తున్న నాలా పై గుట్టు చప్పుడు కాకుండా రెండు దశాబ్దాల క్రితం అతిపెద్ద భవనం నిర్మించారు. ఇక్కడ కూడా నీటి ఉధృతికి ప్రైవేటు వ్యక్తులు అడ్డు వేయడంతో చేసేది ఏమీ లేక కాలనీలను ముంచెత్తుతున్న వరదలు, అయిన కూడా కంటోన్మెంట్ అధికారులు పట్టించుకోవడం నిజంగా శోచనీయమని ఆరో వార్డు కాలనీ వాసులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.అలాగే కబ్జాకు గురైన నాలకు బోర్డు నుంచి ఇంటి నెంబర్ కూడా పొందడం(ఎస్.సీ.బీ:6-31-016) దురదృష్టకరం.ఇప్పటికైనా సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు సిఇవో మధుకర్ నాయక్ ఈ రెండు నాలాల పై కబ్జా పై చర్యలు తీసుకోవాలి,హైడ్రాకుఫిర్యాదు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.అదిగాక సిఇవో పై పూర్తిగా నమ్మకం ఉందంటున్నారు స్థానికులు. వారి నమ్మకం రేపటి వర్షాలకు అడ్డు కట్ట వేస్తుందా లేదా చూడాల్సిందే.

## రైతాంగ ప్రయోజనాలకు ఎప్పటికైనా

# కేసీఆర్ నాయకత్వమే శ్రీరామరక్ష

- రాష్ట్రంలో ప్రస్తుతం జరుగుతున్న నిందలు, దందాలు, చందాలు..
- నీళ్ల విషయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి, బీజేపీ దుష్ప్రచారం చేస్తున్నాయి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** గోదావరి, కృష్ణా జలాల విషయంలో రాష్ట్ర రైతాంగానికి, రైతాంగ ప్రయోజనాలకు ఎప్పటికైనా కేసీఆర్ నాయకత్వమే శ్రీరామరక్ష అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం జరుగుతున్న నిందలు, దందాలు, చందాలు.. ఇదే కాంగ్రెస్ పాలన అని విమర్శించారు. నీళ్ల విషయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి, బీజేపీ దుష్ప్రచారం చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. మేడిగడ్డ బ్యారేజీలో రెండు పిల్లర్లలో ఒక దగ్గర పగుళ్లు వస్తే దాన్ని పట్టుకొని దున్నపోతు ఈనిందని కాంగ్రెస్ వాళ్లు అంటే.. దాన్ని పట్టుకొని దుడ్డెని కట్టేయమని బీజేపీ వాళ్లు అంటున్నారని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు తెలంగాణ భవన్లో పవర్పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. ‘తెలంగాణ ఉద్యమానికి శీర్షిక నీళ్లు, నిధులు, నియామకాలు. అందుకే పదేండ్ల కేసీఆర్ ప్రభుత్వం ఈ మూడు రంగాల్లో సంపూర్ణమైన న్యాయం చేసింది. నీళ్ల విషయంలో కృష్ణా, గోదావరిలో ప్రతినీటి బొట్టును ఒడిసిపట్టి చుక్క నీటిని వదలకుండా కాళేశ్వరం లాంటి ప్రాజెక్టును కాలంతో పోటీపడి కట్టినా, పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని దాదాపు 90 శాతం పూర్తిచేసినా, సీతారామ ప్రాజెక్టును కూడా 90 శాతం పూర్తిచేసి తెలంగాణ రైతాంగం ప్రయోజనం కోసం కేసీఆర్ సర్కారం నిరంతరం పనిచేసింది. కానీ నేడు నీళ్లు, నిధులు, నియామకాలు అనే శీర్షిక ఎక్కడో పోయింది. ఇవాళ రాష్ట్రంలో జరుగుతున్న నిందలు, దందాలు, చందాలు. బీఆర్ఎస్ మీద నిందలు, బిల్డర్లు కాంట్రాక్టర్లతో దందాలు, రాహుల్ గాంధీకి చందాలు.. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న పని ఇది. నిస్సిగ్గుగా రాష్ట్ర ముఖ్యమంత్రి గానీ, బీజేపీ నీళ్ల విషయంలో చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టడానికి హరీశ్రావు వివరంగా సమాచారం అందిస్తారు.గుజరాత్లో మార్బీ అనే ప్రాంతంలో ఒక పెద్ద బ్రిడ్జి కూలి పోయి 140 మంది చనిపోయినా ఏ ఎన్డీఎస్ఏ పోదు, ఏజెన్సీ పోదు. ఆ 140 మంది చావులకు ఫలానావాడు బాధ్యుడని ఏ ఏజెన్సీ గానీ, కేంద్ర ప్రభుత్వం గానీ మాట్లాడదు. బీహార్లో నాలుగు రోజులకి ఒక బ్రిడ్జి కూలిపోతున్నా అడిగే నాథుడు లేడు. అదే తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నా సుంకిశాల రిటైనింగ్ వాల్ కూలిపోయి రూ.100 కోట్లు నష్టం జరిగితే ఎన్డీఎస్ఏ రాదు, ఎవడు రాడు. అలానే అవినీతి, కమీషన్ల కక్కుర్తితో ఎస్ఎల్బీసీ టన్నెల్ కుప్పకూలిపోయి 8 మంది చనిపోయినా.. ప్రమాదం జరిగి 100 రోజులు గడుస్తున్నా ఇప్పటికీ ఉత్తమ్ కుమార్ రెడ్డి, రేవంత్ రెడ్డి, కేంద్రంలో ఉండే ఒక్క మంత్రి ఒక్క మాట కూడా మాట్లాడరు. ఎవరూ బాధ్యత తీసుకునేవారు లేరు. అలాగే వట్టెం పంప్ హౌస్ మునిగిపోతే దాని గురించి మాట్లాడే వాళ్ళు లేరు, పెద్ద వాగు ప్రాజెక్ట్ రెండు సార్లు కొట్టుకు పోయినా అడిగేవాడు లేడు.కానీ కాళేశ్వరంలో 100 కాంపోనెంట్లు ఉంటే ఒక్క మేడిగడ్డ బ్యారేజీలో రెండు పిల్లర్లలో ఒక దగ్గర పగుళ్లు వస్తే దాన్ని పట్టుకొని దున్నపోతు ఈనిందని కాంగ్రెస్ వాడు అంటే దాన్ని పట్టుకొని దుడ్డెని కట్టేయమని బీజేపీ వాళ్లు రెండు రోజుల్లో ఎన్డీఎస్ఏ రిపోర్టును వారి పార్టీ ఆఫీసులో తయారు చేశారు ప్రజలను భ్రమింపచేసే ప్రయత్నం చేశారు. దానికి తిరుగులేని విధంగా ఎల్ అండ్ టీ సంస్థ ఎన్డీఎస్ఏ నివేదికను తిరస్కరిస్తున్నామని స్పష్టం చెప్పింది. అది చెత్తబుట్టలో పడేయడానికి తప్ప ఎందుకు పనికిరాదని చెప్పారు. మేడిగడ్డ బ్యారేజీని కట్టిన సంస్థ పనికిరానిదైతే కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని అదే సంస్థతో ఎందుకు కట్టించావని రేవంత్ రెడ్డిని అడుగుతున్నా. కాంగ్రెస్ కార్యాలయాన్ని కూడా తెలంగాణ నుంచి పోయిన మూటలతో కట్టారని అందరికీ తెలుసు. వాస్తవాలు తెలియజెప్పడానికి, కాంగ్రెస్, బీజేపీలు కుమ్మక్కై నీళ్లిచ్చిన కేసీఆర్ మీద, నీళ్లిచ్చి కన్నీళ్లు తుడిచిన కేసీఆర్ ప్రభుత్వంపైన అభాండాలు వేసే ప్రయత్నం చేస్తున్నారు. కమిషన్ పేరుతో నాటకాలు ఆడుతున్న విషయంలో వాస్తవాలను బట్టబయలు చేయడానికే హరీశ్ రావును తానే కోరాను. ఈ పరంపరలో ఇది మొదటి మీటింగ్. డాలస్, లండన్లో చాలామంది ఎన్ఆర్ఐలు తమకు కూడా వివరాలు చెప్పాలని, మేము కూడా సోషల్ మీడియాలో చెప్తామన్నారు. ఈ విషయంలో ఒకడేమో బట్టకాల్చి మీదేస్తుంటే.. మరొకడేమో తానా అంటే తందానా అంటున్నడు. కాంగ్రెస్, బీజేపీ ఇద్దరు కలిసి తెలంగాణ బొండిగ పిసికే ప్రయత్నం చేస్తున్నరు. తెలంగాణ ముఖ్యమంత్రిగా కేసీఆర్ చేసిన పనిని కావాలని అపవాదులు వచ్చేవిధంగా అనుమానాలు కలిగేలా ప్రచారం చేస్తున్నరు, వాస్తవాలు చెప్పాలని కోరారు. జిల్లాల్లో కూడా ఇలాంటి మీటింగ్లు ఏర్పాటు చేస్తాం. ఇది మొదటి ప్రయత్నం కాదు. ఇప్పటికే మేడిగడ్డం పోయాం. దానిని వెంటనే రిపేర్ చేయాలని, నీళ్లిచ్చే అవకాశం ఉన్నా ఇవ్వడం లేదని ఎన్డీఎస్ఏ యాక్ట్ కూడా చూపెట్టాం. ఓనరే రిపేర్ చేయాలని అందులో ఉంది. ప్రభుత్వం దానిని ఇప్పటికీ పట్టించుకోవడం లేదు. రైతుల పొలాలను ఎండబెడుతున్నది. ఈ విషయంలో ప్రభుత్వం తన వైఖరిని చెప్పాలి. గోదావరి జలాల విషయంలో ఏపీ అనుమతుల్లేకుండా కడుతున్న ప్రాజెక్టు మీద ముఖ్యమంత్రి మాట్లాడడు, బీజేపీ కేంద్ర మంత్రులు మాట్లాడరు, కాంగ్రెస్ బీజేపీ వాళ్లు నోరు తెరవరు. అందుకే గోదావరి, కృష్ణా జలాల విషయంలో రాష్ట్ర రైతాంగానికి, రైతాంగ ప్రయోజనాలకు ఏనాటికైనా కేసీఆర్ నాయకత్వమే శ్రీరామరక్ష.’ అని కేటీఆర్ అన్నారు.

# జీహెచ్ఎంసీ ఆదాయానికి

# గండి కొడుతున్న కార్పొరేటర్లు.?

- డివిజన్ లో జరిగే అక్రమ నిర్మాణాల పై కార్పొరేటర్ల మౌనం ఎందుకు.?
- అక్రమ నిర్మాణాలపై కౌన్సిల్లో కార్పొరేటర్లు నోరు విప్పరే.?
- కార్పొరేటర్ చెప్పారని అక్రమ నిర్మాణాలకు టౌన్ ప్లానింగ్ అధికారుల వత్తాసు.?
- ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతుంది కార్పొరేటర్లు, అధికారులేనా.?
- 6000 జీతంతో ఖరీదైన కార్లతో విలాసమంతమైన జీవితాలు ఎలా.?
- కార్పొరేటర్ కంటే ముందు మీ ఆదాయం ఎంత.? ప్రస్తుత మీ ఆదాయం ఎంత శాతం పెరిగింది.?



**“గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 150 డివిజన్లో కార్పొరేటర్లుగా గెలిచిన వాళ్ళ గెలిచిన సమయంలో వాళ్ళ ఆస్తులు ఎంత.? ప్రస్తుత ఆస్తులు ఎంత.? ఒక్కసారి గెలిస్తేనే వందల కోట్ల వరకు వెళుతున్న కార్పొరేటర్లు రెండవసారి అదే పదవిలో గెలిచి ఎన్ని కోట్ల అక్రమ ఆస్తులు కూడా పెట్టారు.? 6000 జీతంతో ఇన్నోవా, ఫార్చునర్ కార్లు కొంటూ సేవ పేరుతో దోపిడి చేస్తలేరా.? డివిజన్లో ఉన్న సమస్యలను తీర్చలేరు కానీ అక్రమ నిర్మాణాలపై వసూళ్ల దందా చేయడం లేదా.? మీ డివిజన్లో వేయించిన అభివృద్ధి పనుల నాణ్యత ఎంత.? కనీసం రోడ్డు జీవితకాలంలో 10 శాతమైన నాణ్యతతో ఉన్నదా.? ఇక పేద వారి పేరుతో సొల్లు కబుర్లు చెప్పే వాళ్లు పేదల బాగు కోసం ఒక్కరోజైనా పాటుపడినారా.? మైకు దొరుకుతే సేవ తొక్క తోటకూర కట్ట అంటూ సొల్లు కబుర్లు చెప్పే వాళ్లు తమ తప్పులు తెలుసుకొని మాట్లాడితే బాగుండేది. సేవ అనే పదం మీరు మాట్లాడే అర్హత లేదని ప్రజలు బహటంగా చర్చించుకుంటున్నారు”**

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ లో కార్పొరేటర్ల పదవీకాలం మరి కొద్ది రోజుల్లో ముగుస్తుండడంతో కౌన్సిల్ సమావేశాన్ని ఏర్పాటు చేసిన జిహెచ్ఎంసి మేయర్ విజయలక్ష్మి కి కార్పొరేటర్ల నుండి వింత వింత ప్రశ్నలు ఎదురైనాయి. ప్రజల సమస్యలను గాలికి వదిలేసి ప్రజా సమస్యలపై పోరాడతారని కార్పొరేటర్లను డివిజన్లో గెలిపించుకున్న ప్రజలకు కార్పొరేటర్లు చేసింది ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. కొన్ని డివిజన్లో రోడ్లు, డ్రైనేజీలు, స్ట్రీట్ లైట్లు, మ్యాన్ హోల్స్, గుంతల మరమ్మత్తులు సరిగా లేవని ఎన్ని ఫిర్యాదులు ఇచ్చిన వృధాగానే మారింది. జిహెచ్ఎంసి సమావేశంలో డివిజన్లో అభివృద్ధికై కార్పొరేటర్లు ఎక్కడ ప్రస్తావించిన దాఖలాలు లేవని సమావేశంలో ఆ పార్టీ నాయకులు మైకుల ముందు నిలబడి తిట్టుకోవడం తప్ప అభివృద్ధి దిశగా గ్రేటర్ హైదరాబాద్ ని తీసుకెళ్లిన దాఖలాలు ఎక్కడా లేవని, తమ డివిజన్లో జరిగే అక్రమ నిర్మాణాలపై టౌన్ ప్లానింగ్ అధికారులను చర్యలు ఎందుకు తీసుకోడం లేదని కార్పొరేటర్లు ఎందుకు ప్రశ్నించడం లేదు. అధికారులు చర్యలు తీసుకోవద్దని వాళ్లపై పత్తిడి తెచ్చేది కార్పొరేటర్లే.. ఒకవేళ అధికారులు అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తుంటే అడ్డుకోవడానికి వచ్చేది కార్పొరేటర్లు వాళ్ళ షాడో లే కదా అని ప్రజలు ఆరోపిస్తున్నారు. కార్పొరేటర్ గా గెలవగానే హంగు ఆర్భాటంతో తమ డివిజన్లో తాము చెప్పిందే వేదమని అధికారులను శాసిస్తూ అక్రమ సంపాదనకై కొంతమంది కార్పొరేటర్లు తమ ఆదాయ మార్గాలను ఎంచుకున్నారని, గ్రేటర్ హైదరాబాదులో ఎక్కడ చూసినా భారీ అక్రమ నిర్మాణాలు జరుగుతున్న గ్రేటర్ సమావేశంలో అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకునే విధంగా ఒక్క కార్పొరేటర్ కూడా మాట్లాడకపోవడం వారి నిజాయితీకి నిదర్శనంగా మారింది. వారి వారి డివిజన్లో టౌన్ ప్లానింగ్ అధికారులు కార్పొరేటర్ల కనుసైగలతో పనులు కానిస్తున్నారని అక్రమ నిర్మాణాలపై అధికారులకు ఫిర్యాదు చేసిన స్పందించకుండా కార్పొరేటర్ చెప్తే అక్రమ నిర్మాణాలకు వత్తాసు పలుకుతున్నారని కార్పొరేటర్ పదవీకాలం అయిపోయిన తర్వాత అక్రమ నిర్మాణాలపై దర్యాప్తు చేపడితే ఉన్నతాధికారులు టౌన్ ప్లానింగ్ అధికారుల పై చర్య తీసుకుంటారా.? లేక స్థానిక కార్పొరేటర్ పై చర్య తీసుకుంటారా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అధికారులు అవినీతి సొమ్ముకు ఆశపడి కార్పొరేటర్ల చేతుల్లో కీలుబొమ్మలుగా మారి జిహెచ్ఎంసి ఆదాయానికి కోట్లలో గండి కొడుతున్నారు. కొంతమంది కార్పొరేటర్లు తమ వ్యక్తిగత లాభాలకై అక్రమ నిర్మాణాలకు వత్తాసు పలుకుతూ ఆదాయాన్ని పెంచుకుంటూ కోట్లకు పడగలెత్తారన్న దాంట్లో ఎలాంటి అతిశయోక్తిలేదు, ఇక రెండవసారి గెలిచిన కార్పొరేటర్ల అవినీతి దాహానికి హద్దు అదుపు లేకుండా పోయింది. కార్పొరేటర్ గా గెలిచినప్పుడు తమ ఆస్తులు ఎంత ఇప్పుడు తమ అక్రమాస్తులు ఎంత సంపాదించారో ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టరేట్ లేక ఇన్కమ్ టాక్స్ అధికారులు కార్పొరేటర్ల ఆస్తులపై శ్వేత పత్రం విడుదల చేయాలని జర్నలిస్టు సంఘాలు కోరుతున్నాయి.

### - జిహెచ్ఎంసి ఆదాయానికి

### గండి కొడుతుంది కార్పొరేటర్లేనా.?

ప్రభుత్వ ఆదాయాన్ని పెంచడానికి మార్గాలు చూపవలసిన కార్పొరేటర్లు అధికారులు ధనార్జనే ధ్యేయంగా అక్రమ నిర్మాణాలకు వత్తాసు పలుకుతూ అక్రమ నిర్మాణాలపై టౌన్ ప్లానింగ్ అధికారులు కార్పొరేటర్లు వాటాలు పంచుకుంటున్నారా.? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అధికారం ఉంది కదా అని ఇష్టారాజ్యంగా తమ డివిజన్లో రెసిడెన్షియల్ అనుమతులతో కమర్షియల్ నిర్మాణాలు, రెండు అంతస్తుల అనుమతులతో 5 అంతస్తుల అక్రమ అపార్ట్మెంట్లు నిర్మించడం లేదా ఒక్కొక్క కార్పొరేటర్ లక్షలలో అక్రమంగా వసూలు చేయడం లేదా.? ప్రభుత్వ అధికారులలో అవినీతిని పెంచి పోషిస్తుంది కార్పొరేటర్లే కాదా.? అక్రమాలకు వత్తాసు పలికిన కార్పొరేటర్ల పై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని పార్టీలకతీతంగా తమ డివిజన్లో అభివృద్ధి చేపట్టవలసిన కార్పొరేటర్లు దొడ్డి దారిలో అక్రమ నిర్మాణాలకు వత్తాసు పలుకుతూ తమ పార్టీ కార్యకర్తలకు తమకు కావలసిన వారికి అక్రమ నిర్మాణాలకు అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడుతున్నారని, టౌన్ ప్లానింగ్ అధికారులకు ఈ విషయం తెలిసిన కార్పొరేటర్ మాట కాదనలేక అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవడం లేదని ఒకవేళ అధికారులు చర్యలు తీసుకుంటుంటే స్థానిక ఎమ్మెల్యేలతో అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవద్దని కార్పొరేటర్లు ఫోన్లు చేయించడం మర్చిపోయారా.? ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టి టౌన్ ప్లానింగ్ అధికారులు కార్పొరేటర్లు అక్రమ నిర్మాణాలకు వత్తాసు పలుకుతున్నారని గ్రేటర్ హైదరాబాద్ సమావేశంలో అక్రమ నిర్మాణాలపై అధికారులను ప్రశ్నించిన ఒక్క నిజాయితీపరులైన కార్పొరేటర్ లేకపాయే.

### కార్పొరేటర్లు చేసింది అభివృద్ధి ఎంత, అవినీతి ఎంత శ్వేత పత్రం విడుదల చేయాలి

జిహెచ్ఎంసి లో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి నేటి వరకు ఉన్న 150 డివిజన్లో అనుమతులు తీసుకున్న నిర్మాణాలు ప్రస్తుత వాటి పరిస్థితి ఏంటని కోర్టు స్టే పేర్లతో ఎన్ని అక్రమ నిర్మాణాలు ఉన్నాయో 150 డివిజన్లో కార్పొరేటర్ల అభివృద్ధి అవినీతిపై శ్వేత పత్రం విడుదల చేస్తే వాస్తవాలు ప్రజలకు తెలుస్తాయని కార్పొరేటర్లు సమాజానికి మంచి చేశారా చెడు చేశారా అన్నది కూడా బహిర్గతమవుతుందని ప్రజలు కోరుతున్నారు. ఇప్పటివరకు కార్పొరేటర్లు చేసిన అభివృద్ధి పనులపై, వాళ్ల పదవీకాలంలో చేయించిన అక్రమ నిర్మాణాలపై శ్వేత పత్రం విడుదల చేయాలని స్థానిక కార్పొరేటర్లు అధికారంలో ఉన్నప్పుడు ఎన్ని అభివృద్ధి పనులు తమ డివిజన్లో చేశారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. గ్రేటర్ హైదరాబాద్ లో విచ్చలవిడిగా అక్రమ నిర్మాణాలకు వత్తాసు పలికే కార్పొరేటర్లు,అధికారులు రానున్న రోజుల్లో ఇలానే అక్రమ నిర్మాణాలు గ్రేటర్ హైదరాబాదులో చేపడితే ప్రజలకు తాగడానికి నీళ్లు లేక భూగర్భ జలాలు అడుగంటి ఎడారిగా మారుతుందని ఒక్క ఇంకుడు గుంతను కూడా ఏర్పాటు చేయించలేని కార్పొరేటర్లు అవినీతి అక్రమాలపై మాట్లాడడం హాస్యస్పదంగా మారింది. ఇప్పటికైనా ప్రజల సమస్యలపై దృష్టి పెట్టి వాటిని తీర్చే విధంగా చూడండి టైం కూడా లేదు త్వరలో పదవీకాలం ముగియబోతోంది.

# మూడు రోజులుగా సెర్చ్ ఆపరేషన్..

### - మరో ఇద్దరు మావోయిస్టుల హతం



**బీజాపూర్ (ప్రశ్న న్యూస్)** ఛత్తీస్గఢ్ బీజాపూర్ జిల్లా నేషనల్ పార్కులో ఎన్ కౌంటర్ జరిగింది. భద్రతా బలగాలు, మావోయిస్టుల మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో ఇద్దరు మావోయిస్టులు మృతి చెందా రు. గత 3 రోజులుగా ఈ ప్రాంతంలో సెర్చ్ ఆపరేషన్ కొనసాగుతోంది.

కాగా ఇదే ఏరియాలో గురువారం మావోయిస్టు పార్టీ మరో అగ్రనేత తెంటు లక్ష్మీనరసింహ అలియాస్ గౌతమ్, నిన్న మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు అడెల్లు అలియాస్ భాస్కర్ హతమయ్యా రు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588